మంగళవారం
22-08-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 62
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నేటి నుంచి బ్రిక్స్ సదస్సు

దక్షిణాఫ్రికాలోని జొహనెస్‌బర్గ్‌లో ఈనెల 22, 23, 24 తేదీల్లో 15వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. సదస్సులో బ్రెజిల్, చైనా, భారత్, దక్షిణాఫ్రికా అధినేతలు పాల్గొంటారు.

2లో

మణిపూర్ అసెంబ్లీ భేటీపై
సందిగ్ధం

- కేబినెట్ సిఫార్సు చేసినా ఆమోదించని గవర్నరు
- రాజకీయ సంక్షోభంపై అనుమానాలు



ఇంఫాల్: మణిపూర్ అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై సందిగ్ధత ఏర్పడింది. అసెంబ్లీ సమావేశానికి రాష్ట్ర కేబినెట్ సిఫార్సు చేసినా గవర్నరు అనసూయ ఉకే ఇప్పటి వరకు నోటిఫికేషన్ జారీ చేయలేదు. వాస్తవంగా 21వ తేదీ సోమవారమే అసెంబ్లీ సమావేశాలు జరగాల్సి ఉంది. రాజ్ భవన్ నుంచి 'నోటిఫికేషన్' వెలవడనందున సోమవారం అసెంబ్లీ సమావేశం కాలేదని అధికారులు తెలిపారు. ఇది ఒక రకమైన గందరగోళాన్ని సృష్టించింది. మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతున్నందున పార్టీలకు అతీతంగా 10 మంది కుకీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశానికి హాజరు కాలేకపోతున్నట్లు తెలియజేసిన తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. 'సాధారణంగా అసెంబ్లీ సమావేశాల కోసం15 రోజుల ముందు నోటిఫికేషన్ జారీ చేయాలి. అటువంటి నోటిఫికేషన్‌ను గవర్నర్ కార్యాలయం ఇప్పటివరకు జారీ చేయలేదు' అని ఒక అధికారి పీటీఐకి చెప్పారు. అయితే ఈ నెల ప్రారంభంలో జరిగిన కేబినెట్

- మిగతా 2 లో

గర్భ విచ్ఛిత్తికి సుప్రీం అనుమతి

అత్యాచారం వల్ల తల్లవడం మాయని గాయమేనని వ్యాఖ్య
గుజరాత్ హైకోర్టు తీర్పుపై మండిపాటు

న్యూదిల్లీ: సామూహిక అత్యాచారానికి గురైన బాధిత మహిళ గర్భ విచ్ఛిత్తికి సంబంధించి గుజరాత్ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. వైవాహిక బంధానికి వెలుపల తన సమ్మతి లేకుండా బలవంతంగా గర్భం దాల్చడం కోలుకోలేని గాయం లాంటిదేనని, ఆ పరిస్థితి తీవ్ర మనోవేదనకు గురిచేస్తుందని వ్యాఖ్యానించింది. సామూహిక అత్యాచారానికి గురై, గర్భం దాల్చిన మహిళ తన 27 వారాల గర్భాన్ని విచ్ఛిత్తి చేసుకునేందుకు అనుమతించింది. ఈ సందర్భంగా బాధిత మహిళ కేసులో గుజరాత్ హైకోర్టు వ్యవహరించిన తీరును సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. మన వివాహ వ్యవస్థలో

- మిగతా 2 లో

కేసీఆర్ ఎన్నికల
శంఖారావం

115 నియోజకవర్గాలకు బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారు
ఏడుగురు సిట్టింగ్‌లకు మొండిచెయ్యి
రెండు స్థానాల్లో కేసీఆర్ పోటీ

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలోని రాజకీయ పక్షాలు మొదలు.. బీఆర్ఎస్‌లోని సాధారణ కార్యకర్తల వరకూ... అందరూ ఆసక్తిగా ఎదురు చూసిన సమయం రానే వచ్చేసింది. తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల యుద్ధానికి బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ సమర శంఖం పూరించారు. తమ పార్టీ తరపున బరిలో నిలవబోయే గెలుపు గుర్రాల మొదటి జాబితాను విడుదల చేశారు. తొలి జాబితాలోనే ఏకంగా 115 మంది అభ్యర్థులకు టికెట్లు ఖరారు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. కేసీఆర్ జాబితా ప్రకటనతో..

రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగినట్లయింది. సోమవారం కేసీఆర్... బీఆర్ఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... కేవలం నాలుగు నియోజకవర్గాలను మాత్రమే పెండింగ్‌లో పెట్టినట్లు చెప్పారు. వివిధ కారణాల వల్ల ఏడు స్థానాల్లో మాత్రమే సిట్టింగ్‌లను మార్చినట్లు చెప్పారు. ఇక కేసీఆర్ రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయనుండటం విశేషం. ఆయన కామారెడ్డి, గజ్వేల్ స్థానాల నుంచి బరిలోకి

- మిగతా 2 లో

అన్ని వర్గాలను కలుస్తాం

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

ఇంఫాల్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా నేతృత్వ బృందం సోమవారం మణిపూర్ రాజధాని ఇంఫాల్ చేరుకుంది. నాలుగు రోజుల పాటు ఆ రాష్ట్రంలో పర్యటించనుంది. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ హింస పీడిత రాష్ట్ర పరిస్థితులను అధ్యయనం చేసేందుకు వచ్చామన్నారు. అన్ని సామాజిక వర్గాల వారితో మాట్లాడతామని చెప్పారు. లోయ, గిరి ప్రాంతాలలోని పునరావాస కేంద్రాలను సందర్శిస్తామని, క్షేత్రస్థాయి పరిస్థితులను ఆరా తీస్తామని తెలిపారు.

తమ పర్యటన చివరి రోజున మణిపూర్ గవర్నర్ అనుసూయ ఉయికెను కలుస్తామని రాజా చెప్పారు. రాష్ట్రంలో పార్టీకి మంచి ఆదరణ ఉంది. బుధవారం పార్టీ 75వ వ్యవస్థాపక దినం సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలోనూ నాయకులు పాల్గొనున్నారు. రాజా వెంట సీపీఐ జాతీయ కార్యదర్శులు వినయ్ విశ్వం, కె.నారాయణ, రామకృష్ణ పాండా, అసోం మహిళా నేత అసోమీ గొగోయి ఉన్నారు. మే 3వ తేదీ నుంచి కుకీలు, మయితే వర్గీయుల మధ్య ఘర్షణలతో ఈశాన్య రాష్ట్రం అట్టుడికిపోతున్న విషయం విదితమే.

వైసీపీది అరాచక పాలన

జగన్ మళ్లీ సీఎం కాలేరు
కమ్యూనిస్టులు అసెంబ్లీలో అడుగుపెట్టడం తథ్యం
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
'గోదావరి గర్జన'తో ఎరుపెక్కిన రాజమహేంద్రవరం

8లో

రాష్ట్రంలో వైసీపీ అరాచకపాలనను ప్రజలు గమనిస్తున్నారు... రాబోయే ఎన్నికల్లో ఎన్ని అరాచకాలు, కుట్రలు కుయుక్తులు పన్నినా జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కాలేరని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పేర్కొన్నారు.

'ఇండియా' లోగో రెడీ

సెప్టెంబరు 1న ఆవిష్కరణ
'ముంబై' సమావేశాలకు 80 మంది నేతలు హాజరు
కూటమి నేతలకు ఉద్ధవ్ ఆతిథ్యం

న్యూదిల్లీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించడమే లక్ష్యంగా ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్ (ఇండియా) ముందుకు సాగుతోంది. కలిసి వచ్చే పార్టీలతో మమేకమవుతూ మరింతగా బలాన్ని పెంచుకుంటూ ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తోంది. ఇదే క్రమంలో ఈనెల 31, సెప్టెంబరు 1వ తేదీల్లో ముంబైలో సమావేశం కానుంది. ఈ సందర్భంగా కూటమి లోగోను ఆవిష్కరించాలని భావిస్తోంది. లోగో సిద్ధం కాగా దీని విడుదల కోసం సన్నాహాలను కూటమి నేతలు చేపట్టారు. తొలిరోజు.. అంటే ఆగస్టు 31న ముంబై సబర్బన్‌లో ఉన్న గ్రాండ్ హయత్ హోటల్‌లో కూటమి నేతలకు శివసేన

- మిగతా 2 లో

జాబిల్లి రెండో వైపు...

కొత్త చిత్రాలు పంపిన చంద్రయాన్-3

బెంగళూరు: చంద్రయాన్-3 తన గమ్యం వైపునకు వేగంగా దూసుకెళుతోంది. చంద్రుడిపై దిగేందుకు సిద్ధంగా ఉంది. బుధవారం సాయంత్రం 6.04 గంటలకు చంద్రుడి ఉపరితలాన్ని లాండర్ మాడ్యూల్ తాకబోతోందని ఇస్రో సోమవారం తెలిపింది. సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియ ప్రత్యక్ష ప్రసారం బుధవారం 5:20 గంటల నుంచి ప్రారంభమవుతుందని ప్రకటించింది. అదే సమయంలో ల్యాండర్ హజార్డ్ డిటెక్షన్, అవైడెన్స్ కెమెరా (ఎల్‌హెచ్‌డీఏసీ) తీసిన చిత్రాలు కొన్నింటిని విడుదల చేసింది. చంద్రయాన్ సాఫ్ట్ ల్యాండింగ్ కోసం ఈ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మూడు రాజధానులు ఎందుకు సార్, చంద్రునిపై ఆంధ్రా రాజధాని అందాం!

మాది ప్రజా ప్రభుత్వం

- దసరాకు ఒక డీఏ ఇస్తాం
- జీపీఎస్‌కు ఆర్డినెన్స్ సిద్ధం
- వైద్య విభాగం మహిళలకు ఐదు సెలవులు
- బాబుకు ఉద్యోగులంటే చులకన భావన
- ఏపీ ఎన్జీవోల రాష్ట్ర మహాసభలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అభివృద్ధి, సంక్షేమంలో తమది ప్రజాప్రభుత్వం అని, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఉద్యోగులు వారధులని, ఏ ప్రభుత్వంతో పోల్చినా తమ ప్రభుత్వం మెరుగ్గానే ఉందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. అన్ని సేవలను గ్రామ స్థాయికి విజయవంతంగా చేర్చామన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఎల్లప్పుడూ సానుకూలంగా ఉందని స్పష్టం చేశారు. విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో సోమవారం జరిగిన ఆంధ్ర ప్రదేశ్ నాన్-గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీ ఎన్జీవోల) 21వ రాష్ట్ర మహాసభలకు ముఖ్యఅతిథిగా సీఎం జగన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో సంఘ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు తన ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేశారని జగన్ ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం

- మిగతా 2 లో

నేటి నుంచి బ్రిక్స్ సదస్సు

బీజింగ్: దక్షిణాఫ్రికాలోని జొహానెస్‌బర్గ్‌లో ఈనెల 22, 23, 24 తేదీల్లో 15వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. సదస్సులో బ్రెజిల్, చైనా, భారత్, దక్షిణాఫ్రికా అధినేతలు పాల్గొంటారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) వారెంట్ జారీ చేయడంతో ఆయన హాజరు కావడం లేదని సమాచారం. ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియా, కరేబియన్ సహా 69 దేశాల ప్రతినిధులు బ్రిక్స్ సదస్సులో పాల్గొనున్నారని దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రి నలేండి పాండోర్ తెలిపారు. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి, ఆఫ్రికన్ యూనియన్ కమిషన్ చైర్‌పర్సన్, న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ అధ్యక్షుడు వంటి 20 మంది ప్రముఖులతో పాటు దిగ్గజ వ్యాపారవేత్తలు హాజరుకానున్నారు.

జొహానెస్‌బర్గ్‌కు జిన్‌పింగ్

బ్రిక్స్ సమావేశాల్లో పాల్గొనేందుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సోమవారం బీజింగ్ నుంచి దక్షిణాఫ్రికాకు పయనమయ్యారు. ఈ పర్యటనలో భాగంగా బ్రిక్స్ సదస్సులో పాల్గొంటారు. ఈనెల 24న దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసాతో కలిసి చైనా-ఆఫ్రికా నేతల బ్రిక్స్ ప్లస్ చర్చలకు జిన్‌పింగ్ అధ్యక్షత వహిస్తారు. రెండు దేశాల దౌత్య బంధానికి 25ఏళ్లు అయిన వేళ దక్షిణాఫ్రికాకు జిన్‌పింగ్ వెళ్లడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ పర్యటనలో రెండు దేశాల మధ్య కొన్ని అవగాహన ఒప్పందాలు జరగనున్నట్లు చైనా విదేశాంగ వెల్లడించింది. దౌత్య, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే విధంగా ఇంకొన్ని ఒప్పందాలు కూడా జరగబోతున్నట్లు తెలిపింది. నూతన అంతర్జాతీయ పరిపాలన, బహుపాక్షిక ఆర్థిక ఆర్కిటెక్చర్ ప్రతిపాదనలను ప్రవేశపెట్టే యోచనలో బీజింగ్ ఉంది. చైనా ప్రస్తుత దక్షిణాఫ్రికాకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి దేశంగా ఉంది.

ద్వైపాక్షిక సంబంధాలు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం ఆధారంగా పదేళ్ల వ్యూహాత్మక సహకార కార్యక్రమం '2020-29)కు అనుగుణంగా కొనసాగుతున్నట్లు చైనా వర్గాలు వెల్లడించాయి.

గ్వాటెమాలా అధ్యక్ష ఎన్నికల్లో

అరెవాలో ఘన విజయం

గ్వాటెమాల సిటీ: గ్వాటెమాలా అధ్యక్షుడి ఎన్నికల్లో అవినీతి వ్యతిరేకవాది, వామపక్ష నాయకుడు, ప్రోగ్రెసివ్ మూవ్‌మెంట్ సెమిల్లా పార్టీ అభ్యర్థి బెర్నార్డో అరెవాలో ఘన విజయం సాధించారు. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం జరిగిన ఎన్నికలను ఆయన క్లీన్‌స్వీప్ చేశారు. 59.1శాతం ఓట్లతో గెలిచారు. ఆయనకు సమీప ప్రత్యర్థి శాండ్రా టోర్రెస్‌కు 36.1శాతం ఓట్లు వచ్చాయి. బెర్నార్డో అరెవాలో విజయం సాధించినట్లు సుప్రీం ఎలక్టోరల్ ట్రిబ్యునల్ ప్రకటించింది. ఎలక్టోరల్ ట్రిబ్యునల్ అధ్యక్షులు ఇర్మా పలెన్సియా స్పందిస్తూ 'ఈరోజు ప్రజావాణి వినిపించింది' అని అన్నారు. ఫలితాలు వెలువడిన అనంతరం ఎక్స్ మాధ్యమంగా 'గ్వాటెమాలా వర్ధిలాలి' అని అరెవాలో నినాదమిచ్చారు. 'ఇది ప్రజల విజయం. ఐక్యంగా అవినీతిని ఓడిద్దాం' అని పిలుపునిచ్చారు. ప్రస్తుత అధ్యక్షుడు అలెగ్జాండ్రో గియామెట్టే ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, జూన్‌లో జరిగిన తొలిదశ ఓటింగ్‌లో అరెవాలో (64) రెండో స్థానంలో నిలిచారు. అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడిన ప్రతిపక్షాల అభ్యర్థులపై అనర్హత వేటు క్రమంలో గౌటెమాలా ఎన్నికల సంఘంపై ప్రజలు గుర్రుగా ఉండటం, అర్హులైన ఓటర్లు 40శాతం మంది ఓటింగ్‌ను బహిష్కరించడం, 24శాతం మంది ఖాళీ బాలెట్లు /చెల్లని ఓట్లు వేయడం వంటివి జరిగాయి. ఈ క్రమంలో 11.8శాతం ఓట్లు అరెవాలో సొంతం చేసుకోగా టోర్రెస్‌కు 16శాతం ఓట్లు వచ్చాయి. తాజా ఓటింగ్‌లో టోర్రెస్‌పై అరెవాలో భారీ మెజారిటీతో గెలిచారు.

లెఫ్ట్ నేత గోంజాల్వెజ్ ముందంజ

ఈక్వెడార్ అధ్యక్ష ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సాధించిన మహిళా అభ్యర్థి

అక్టోబరులో మళ్లీ ఓటింగ్

క్విటో: ఈక్వెడార్‌లో అధ్యక్ష ముందుస్తు ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. సిటిజెన్ రివల్యూషన్ మూవ్‌మెంట్ (లెఫ్ట్) పార్టీ అభ్యర్థి లూయిసా గోంజాల్వెజ్‌కు అత్యధిక ఓట్లు సాధించారు. 43.92 శాతం చెల్లుబాటు ఓట్లలో 33.44శాతం ఓట్లు గోంజాల్వెజ్‌కు లభించాయి. ఆ తర్వాత స్థానంలో నేషనల్ డెమొక్రటిక్ యాక్షన్‌కు చెందిన దానియల్ నొబోవా నిలిచారు. దానియల్‌కు 24.31శాతం ఓట్లు వచ్చాయి. ఈ మేరకు జాతీయ ఎన్నికల మండలి (సీఎన్‌ఈ) ప్రకటించారు. అత్యధిక ఓట్లు సాధించిన అధ్యక్ష మహిళా అభ్యర్థిగా గోంజాల్వెజ్ నిలిచారు. ఫలితాలు వెలవడిన తర్వాత గోంజాల్వెజ్ మాట్లాడుతూ తన పార్టీ వర్గాలకు, అసెంబ్లీ అభ్యర్థులకు, దేశ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మా కృతజ్ఞత, ప్రశంస అంతా ఈక్వెడార్ ప్రజలకే అని అన్నారు. అక్టోబరు 15న రెండవ దశ ఓటింగ్ జరగనుంది. లూయిసా గోంజాల్వెజ్, దానియల్ నొబోవా మధ్య పోటీ జరుగుతుంది. ఓ మహిళా అభ్యర్థికి ఇంత భారీగా ఓట్లు రావడం ఇదే మొదటిసారిగా తెలుస్తోంది.

మాది ప్రజా ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగులతో అడ్డగోలుగా వ్యవహరించిందన్నారు. చంద్రబాబు రాసిన మనసులో మాట పుస్తకాన్ని సీఎం గుర్తుచేస్తూ... ఉద్యోగులపై చంద్రబాబుకు దారుణమైన అభిప్రాయం ఉందని చెప్పారు. చంద్రబాబు దృష్టిలో కొందరే మంచివారనీ, మిగిలిన వారంతా లంచగొండులేనని అన్నారు. ఉద్యోగులను నిందించే హక్కు ఆయనకు ఎవరి చ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి చంద్రబాబు ఉద్యోగులకెలా మంచి చేస్తారంటూ సీఎం ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో అడ్డగోలుగా దోచుకుందని గుర్తు చేశారు. మొక్కుబడిగా కొన్ని ఉద్యోగాలనే విదిల్చారని దుయ్యబట్టారు. చంద్రబాబు హయాంలో దాదాపు 54 ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేశారన్నారు. ఈయన హయాంలో ఆర్టీసీ పరిస్థితి, ప్రభుత్వ పాఠశాలల దుస్థితి ఎలా ఉందనేదీ గుర్తెరగాలని సూచించారు. అలాంటి వారు ఉద్యోగులకు న్యాయం చేయగలరా అని ప్రశ్నించారు. చంద్రబాబు, ఆయన వర్గానికి తమ ప్రభుత్వంపై కడుపు మంట అని సీఎం మండిపడ్డారు. ఉద్యోగులకు సీఎం వరాల జల్లు కురిపించారు. పెండింగ్‌లో ఉన్న డీఏలలో ఒక డీఏను వచ్చే దసరా కానుకగా ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చారు. వైద్యారోగ్య విభాగంలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు ఐదు రోజుల క్యాజువల్ లీవ్‌లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ఉద్యోగులకు స్నేహపూర్వక వాతావరణంతో గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) అమలులోకి తెచ్చినట్లు సీఎం స్పష్టం చేశారు. జీపీఎస్ స్కీమ్‌కు త్వరలో ఆర్డినెన్స్ వస్తుందని ప్రకటించారు. జీపీఎస్ దేశంలోనే ఒక విప్లవాత్మకమైన నిర్ణయమని చెప్పారు. తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకునే వ్యక్తినని జగన్ అన్నారు. పదవీ విరమణ అయ్యాక ఉద్యోగులకు మంచి జరగాలనే జీపీఎస్‌ను తెచ్చినట్లు పునరుద్ఘాటించారు. దేశంలోనే ఇది అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని నొక్కిచెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో 2019 నుంచి 3 లక్షల 19 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని స్పష్టం చేశారు. వైద్యారోగ్య రంగంలో 53 వేల మందిని నియమించామని అన్నారు. 10 వేల కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించామని వివరించారు. ఉద్యోగుల వేతనాల కోసం రూ.3,300 కోట్లు ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు.10 వేల కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తున్నామన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ గురించి అందరికీ తెలిసిందేనని, 2019 నుంచి ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించామని సీఎం తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంలో చేసి తమ చిత్తశుద్ధిని చాటుకున్నామన్నారు. పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 కు పెంచామన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిజాయితీగా నిబద్ధతతో ఉన్నట్లు స్పష్టం చేశారు. గత ప్రభుత్వాల వలే కాకుండా ఎన్నికలతో సంబంధం లేకుండా ఉద్యోగుల వేతనాలను పెంచామని, అన్ని వర్గాలకు ప్రజలకు న్యాయం చేశామని అన్నారు. ప్రస్తుతం గ్రామ స్థాయిలోని ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా నడుస్తున్నాయని జగన్ చెప్పారు. గత ప్రభుత్వం వ్యవస్థలన్నిటినీ నిర్వీర్యం చేసిందని, ప్రభుత్వాస్పత్రులను నాశనం చేసిందన్నారు. జిల్లాల విభజనతో పాలన ప్రజలకు మరింత దగ్గరైందని చెప్పారు. గత ప్రభుత్వాలు పక్కనపెట్టిన అనేక సమస్యలకు పరిష్కారం చూపామని సీఎం వెల్లడించారు. తొలుత సమావేశంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఆదిమూలపు సురేశ్, జోగి రమేశ్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఏపీ ఎన్జీవో సంఘం నేత బండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ఇండియా' లోగో రెడీ

(మొదటిపేజీ తరువాయి)

(యూబీటీ) నేత ఉద్ధవ్ ఠాక్రే విందు ఏర్పాటు చేశారు. ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీతో పాటు కూటమిలోని వివిధ పార్టీల నేతలు హాజరు కానున్నారు. అదే వేదికగా సెప్టెంబరు 1న 'లోగో' ఆవిష్కరణ, ఆపై చర్చలు జరగనున్నాయి. అనంతరం విలేకరులతో సమావేశాన్ని నిర్వహిస్తారు. ఇదిలావుంటే, కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్ర విభాగంతో పాటు ముంబై శాఖల ద్వారా ప్రతిపక్ష నేతలకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయనున్నారు. ఇండియా కూటమి ఇప్పటికే రెండుసార్లు భేటీ అయింది. జనతాదళ్ (యునైటెడ్) అధినేత, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, రాష్ట్రీయా జనతా దళ్ (ఆర్జేడీ) నేత, బీహార్ ఉప-ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ సంయుక్త అధ్వర్యంలో పాట్నాలో విపక్ష కూటమి తొలిసారి భేటీ అయింది. అనంతరం కాంగ్రెస్ సారథ్యంలో రెండో సమావేశం కర్నాటక, బెంగళూరులో జరిగింది. ఈ సమావేశంలో కూటమికి 'ఇండియా'గా నామకరణం జరిగింది. ముంబైలో జరగనున్న మూడో సమావేశానికి శివసేన (ఉద్ధవ్ బాల్ థాక్రే) వర్గం అధినేత, మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే ఆతిథ్యమిస్తున్నారు. ప్రతి సమావేశానికి కూటమిలో భాగస్వామ్య పార్టీల సంఖ్యాబలం పెరుగుతూ వస్తోంది. పాట్నా సమావేశంలో 17 పార్టీలకు చెందిన 32 మంది పాల్గొనగా బెంగళూరు సమావేశంలో 26 పార్టీల నేతలు హాజరయ్యారు. దేశ ఆర్థిక రాజధానిలో జరిగే మూడో సమావేశంలో 26 కంటే ఎక్కువ పార్టీల నుంచి 80 మంది నేతలు హాజరయ్యే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం. ఇప్పటివరకు 26 పార్టీలు కూటమిలో భాగంగా ఉండగా, ముంబైలో రెండ్రోజులు జరిగే సమావేశాలలో మరికొన్ని పార్టీలు చేరపోతున్నట్లు తెలిసింది. కూటమి మూడో సమావేశాన్ని విజయవంతం చేసేందుకు ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సూక్ష్మస్థాయి ప్రణాళికలతో పనిచేస్తున్నట్టు కాంగ్రెస్ మహారాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు నసీమ్ ఖాన్ తెలిపారు.

నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) అధినేత శరద్ పవార్, కాంగ్రెస్ నేత అశోక్ చవాన్ సహా మహా వికాస్ అఘాడి నాయకులందరూ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారని చెప్పారు. అతిథులకు హయాత్ హోటల్‌లో సంప్రదాయబద్ధంగా స్వాగతం లభిస్తుందన్నారు. సమావేశాలు ముగిసిన తర్వాత కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సెంట్రల్ ముంబైలోని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం తిలక్ భవన్‌ను సందర్శిస్తారని కాంగ్రెస్ వర్గాల సమాచారం.

జాబిల్లి రెండో వైపు...

(మొదటిపేజీ తరువాయి)

కెమెరా ఉపయుక్తంగా ఉంటుంది. కిందకు దిగే సమయంలో ఎలాంటి ఎత్తుపల్లాలు, బండ రాళ్లు వంటివి అడ్డురాకుండా అక్కడి చిత్రాలను చూపుతుంది. ఇప్పటివరకు ఎవరూ చూడని చంద్రుడి అవతలి పక్క చిత్రాలను ఈ కెమెరా బంధించిందని ఎక్స్ మాధ్యమంగా ఇస్రో తెలిపింది. ఈ కెమెరాను ఇస్రో అనుబంధ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఎస్‌ఏసీ), అహ్మదాబాద్ తయారు చేసింది. సాధారణంగా మనకు చంద్రుడి ఒకవైపే కనిపిస్తుంది. చంద్రుడు తన కక్ష్య మీద ఒకసారి పూర్తిగా భ్రమించటానికి పట్టే సమయం, భూమి చుట్టూ తిరిగి రావటానికి పట్టే సమయం సమానంగా ఉంటుంది. దీన్ని టైడల్ లాకింగ్ అంటారు. ఇందుకోసమే చంద్రుడి ఒక వైపే మనకు కనిపిస్తుంది. ఇదిలావుంటే చంద్రయాన్-3ను భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం జులై 19న నింగిలోకి పంపింది. ఒకదాని తర్వాత ఒకటిగా కక్ష్య తగ్గింపు దశలు సాగాయి. ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ విడిపోవడం, ఆపై చంద్రుడిపై దిగేందుకు వేగాన్ని నియంత్రించడం దశలు పూర్తి అయ్యాయి. చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టబోతోంది. ఆ దిశగా ల్యాండర్ విక్రమ్ పయనిస్తోంది. ప్రస్తుతం 25×134 కి.మీల కక్ష్యలో ల్యాండర్ పరిభ్రమిస్తోంది. ఈ నెల 23న చంద్రుడిపై లాండర్ దిగబోతోంది. ఇది విజయవంతమైతే సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన సోవియట్ యూనియన్, అమెరికా, చైనా జాబితాలో భారత్ చేరిపోతుంది.

'మిత్రమా.. స్వాగతం'

2019లో ప్రయోగించిన చంద్రయాన్-2 మిషన్‌లో భాగంగా పంపించిన ఆర్బిటర్ చంద్రుడి చుట్టూ తిరుగుతోంది. ఇదిప్పుడు చంద్రయాన్-3కి అధికారికంగా స్వాగతం పలికింది. దీంతో చంద్రయాన్-3 ల్యాండర్ మాడ్యుల్‌ను అనుసంధానించినట్లు ఇస్రో తెలిపింది. ఈ క్రమంలో మిత్రమా.. స్వాగతం అంటూ చంద్రయాన్-3 ల్యాండర్ మాడ్యుల్‌ను చంద్రయాన్-2 ఆర్బిటర్ పలుకరించింది. ఈ రెండింటి మధ్య పరస్పర సమాచార మార్పిడి వ్యవస్థ ఏర్పడిందని ఇస్రో తెలిపింది. ల్యాండర్ మాడ్యుల్‌ను చేరుకునేందుకు బెంగళూరులోని ఇస్రో టెలిమెట్రీ, ట్రాకింగ్, కమాండ్ నెట్వర్కింగ్ కేంద్రానికి చెందిన ఎంఓఎక్స్ (మిషన్ ఆపరేషన్స్ కాంపెక్స్)కు మరిన్ని దారులు ఏర్పడ్డాయని పేర్కొంది. 2019 జులై 22న నింగిలోకి పంపిన చంద్రయాన్-2లో ఆర్బిటర్, ల్యాండర్, రోవర్ ఉన్నాయి. చంద్రుడి ఉపరితలంపై సాఫ్ట్ ల్యాండింగ్ చివరి క్షణాల్లో లాండర్ కూలిపోయింది. దీంతో ఆ మిషన్ విఫలమైంది. అయితే ఆర్బిటర్ మాత్రం చంద్రుడి కక్ష్యలో ఇప్పటికీ తిరుగుతోంది. సరిపడ ఇంధనం ఉండటంతో మరో ఏడేళ్లు పనిచేస్తుందని 2019లో ఇస్రో తెలిపింది.

కేసీఆర్ ఎన్నికల శంఖారావం

(మొదటిపేజీ తరువాయి)

దిగుతున్నారు. 2023 ఎన్నికలకు ఆరేడుగురు సిట్టింగ్‌లను మాత్రమే తప్పించామని, అందులోను బాగా పని చేసే అభ్యర్థులు కూడా ఉన్నారని కేసీఆర్ చెప్పారు. ఉదాహరణకు వేములవాడ అభ్యర్థి చెన్నమనేని రమేశ్ పౌరసత్వం నేపథ్యంలో ఆయనకు టికెట్ ఇవ్వడం లేదన్నారు. మొత్తానికి పెద్దగా మార్పులు, చేర్పులు లేవన్నారు. బోథ్, అసిఫాబాద్, హైదరాబాద్‌లోని ఉప్పల్, కోరుట్లలో మాత్రమే మార్పులు చేసినట్లు చెప్పారు. ఎన్నికలంటే ఇతర పార్టీలకు రాజకీయమని విమర్శించారు. గుజరాత్, మహారాష్ట్రలను తలదన్నేలా తెలంగాణ అభివృద్ధి చెందిందన్నారు. 24 గంటల విద్యుత్ ఇస్తున్నది దేశంలో ఒక్క తెలంగాణ మాత్రమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేస్తుందో కర్నాటకలో తెలిసిపోయిందన్నారు. తెలంగాణలో మజ్లిస్ పార్టీ, బీఆర్ఎస్ కలిసి ముందుకు సాగుతున్నాయన్నారు. మజ్లిస్, తాము కలిసి ఉమ్మడి హైదరాబాద్‌లో 29 సీట్లకు ఇరవై తొమ్మిది తామే గెలుస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రకటించిన అభ్యర్థులను మనస్ఫూర్తిగా స్వీకరించి, అందర్నీ గెలిపించాలని కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ వచ్చే ఎన్నికల్లో 95 నుంచి105 సీట్లలో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జనగామ, నాంపల్లి, గోషామహల్, నర్సాపూర్ నియోజకవర్గాలను పెండింగ్‌లో ఉంచినట్లు చెప్పారు. కేసీఆర్ సెంటిమెంట్ గా భావించే శ్రావణ మాసం పంచమి తిథి కావడంతో ఇదే మంచి ముహూర్తంగా భావించి అభ్యర్థులను ప్రకటిస్తున్నట్లుగా కేసీఆర్ వెల్లడించారు.

సామాజిక వర్గాల వారీగా...

బీఆర్ఎస్ జాబితాలో 58 మంది ఓసీలు, 20 మంది ఎస్సీలు, 12 మంది ఎస్టీలకు, ముగ్గురు మైనార్టీలు, ఏడుగురు మహిళలకు సీట్లు దక్కాయి.రెడ్డి సామాజిక వర్గానికి 40, 11 మంది వెలమ, ఐదుగురు కమ్మ, వైశ్య, బ్రహ్మణ సామాజిక వర్గాలకు ఒక్కొక్కరికి సీట్లు కేటాయించారు.మున్నూరు కాపులో 10, యాదవ, ఐదు, గౌడ నలుగురు, బెస్త 1, వంజర, పద్మశాలికి ఒక్కరికి చొప్పున సీటు కేటాయించారు. లంబాడీ ఏడు, ఆదీవాసీలకు ఐదు, మాదిగ 11, మాల 8, నేతకాని సామాజిక వర్గాలకు ఒక్క సీటు కేటాయించారు.

మంత్రివర్గ విస్తరణ

సీఎం కేసీఆర్ నేడో, రేపో మంత్రివర్గ విస్తరణ చేపట్టే అవకాశం ఉన్నట్లుగా జోరుగా వార్తలు వస్తున్నాయి. అయితే అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. ఖాళీ అయిన ఈటల రాజేందర్ స్థానంలో ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డిని కేబినెట్లోకి తీసుకోనున్నట్లుగా తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సోమవారం రాత్రికి పుదుచ్చేరి నుండి హైదరాబాద్ రానున్నారు. ఆ తర్వాత మంత్రిగా మహేందర్ రెడ్డి ప్రమాణం ఉంటుందని తెలుస్తోంది. నేడు బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటన, ఎన్నికలకు మరో మూడు నాలుగు నెలలు మాత్రమే ఉన్న సమయంలో కేబినెట్ విస్తరణ ఆసక్తికరంగా మారింది. ఇందుకు సంబంధించి మహేందర్ రెడ్డి మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ... ఈ రోజు మధ్యాహ్నం గవర్నర్‌తో కేసీఆర్ మాట్లాడినట్లు చెప్పారు. కేటీఆర్ అన్నీ సెట్ చేసి వెళ్లారన్నారు. ఎల్లుండి రాజ్ భవన్‌లో ప్రమాణ స్వీకారం ఉంటుందని చెబుతూనే, గవర్నర్ వచ్చే వరకు మాత్రం తాను ఏమీ మాట్లాడనని చెప్పారు.

గర్భ విచ్ఛిత్తికి సుప్రీం అనుమతి

(మొదటిపేజీ తరువాయి)

ఓ మహిళ తల్లి కావడమనేది ఆ దంపతులకే కాదు...వారి కుటుంబసభ్యులకూ అత్యంత సంతోషకరమైన విషయమని, కానీ, వివాహ బంధానికి వెలుపల తన సమ్మతి లేకుండా గర్భం దాల్చడం...ఆ మహిళ జీవితానికి హానికరమని సుప్రీం స్పష్టంచేసింది. ముఖ్యంగా అత్యాచారం కారణంగా గర్భం రావడం బాధిత మహిళను తీవ్ర వేదనకు గురిచేస్తుందని, ఇది ఆమె శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని తెలిపింది. ఓ మహిళ లైంగిక దాడిని ఎదుర్కోవడమే అత్యంత బాధాకరమైతే... దాని ఫలితంగా ఆమె గర్భం దాల్చడం కోలుకోలేని గాయమే అవుతుందని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసులో బాధిత మహిళ గర్భ విచ్ఛిత్తికి గుజరాత్ హైకోర్టు అనుమతించకపోవడం సరికాదని సుప్రీంకోర్టు ధర్మాసనం అసహనం వెలిబుచ్చింది. బాధిత మహిళ వ్యథ, వైద్య రిపోర్టులను పరిగణనలోకి తీసుకుని ఆమె తన 27 వారాల గర్భాన్ని తొలగించుకునేందుకు సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది. మంగళవారమే ఆమె ఆసుపత్రిలో చేరాలని ఆదేశించింది. ఒకవేళ, విచ్ఛిత్తి ప్రక్రియ సమయంలో పిండం సజీవంగా ఉంటే... ఇంక్యుబేషన్‌లో పెట్టి సంరక్షించాలని సూచించింది. ఆ తర్వాత చట్టప్రకారం ఆ చిన్నారి సంరక్షణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం చూసుకోవాలని స్పష్టంచేసింది.

బాధిత మహిళ తొలుత తన గర్భాన్ని విచ్ఛిత్తి చేసుకునేందుకు అనుమతినివ్వాలని కోరుతూ ఈ నెల 7న గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. 8న కోర్టు విచారణకు స్వీకరించి...వైద్య నివేదికకు ఆదేశించింది. 10న నివేదిక వచ్చింది. 11న నివేదిక అందినట్లు ధ్రువీకరించి కేసును 12 రోజులకు అంటే 23కు హైకోర్టు వాయిదా వేసింది. దీంతో బాధితురాలు సుప్రీంకోర్టుకు వెళ్లగా...గుజరాత్ హైకోర్టు తీరుపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఈ పిటిషన్‌ను పెండింగ్‌లో పెట్టడం ద్వారా విలువైన సమయం వృథా అయిందని సుప్రీంకోర్టు తెలిపింది. దీనిపై సోమవారం విచారణ చేపడతామని తెలిపింది. అయితే ఈ లోగానే, గత శనివారం గుజరాత్ హైకోర్టు విచారణ జరిపి మహిళ పిటిషన్‌ను కొట్టేసింది. దీనిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. గుజరాత్ హైకోర్టులో ఏం జరుగుతోందని నిలదీసింది. అత్యున్నత న్యాయస్థానం ఉత్తర్వులకు వ్యతిరేకంగా దేశంలో ఏ కోర్టూ తీర్పులు ఇవ్వకూడదని, ఇది రాజ్యాంగ ఫిలాసఫీకి విరుద్ధమని ధర్మాసనం ఘాటుగా స్పందించింది.

పెండింగ్‌లో అవినీతి కేసులు

20 ఏళ్లకు పైబడిన కేసులు 313: సీవీసీ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సీబీఐ దర్యాప్తు చేసిన 6,841 అవినీతి కేసులు వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. వీటిల్లో 300కి పైగా కేసుల విచారణ 20 ఏళ్లకు పైబడి సాగుతూనే ఉంది. ఈ మేరకు కేంద్ర విజిలెన్స్ కమిషన్ తమ వార్షిక నివేదికలో వెల్లడించింది. సీవీసీ వెల్లడించిన గణాంకాల ప్రకారం...మొత్తం కేసుల్లో 313 కేసులు 20 ఏళ్లకు పైగా వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. 2,039 కేసుల విచారణ 10-20 ఏళ్లుగా సాగుతోంది. 2,324 కేసులు 5-10 ఏళ్లుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. 842 కేసుల విచారణ 3-5 ఏళ్లుగా సాగుతోంది. మూడేళ్ల కంటే తక్కువ కాలం పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య 1,323గా ఉంది. వీటితో పాటు, అవినీతి కేసులకు సంబంధించి 12,408 అప్పీళ్లు, రివిజన్లు సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నట్లు సీవీసీ వెల్లడించింది. ఇందులో 417 అప్పీళ్లు 20ఏళ్ల నాటివేనని పేర్కొంది. ఇక, సీబీఐ వద్ద 692 అవినీతి కేసులు దర్యాప్తు దశలోనే పెండింగ్‌లో ఉన్నట్లు సీవీసీ తెలిపింది.

ఇందులో 42 కేసులు ఐదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించింది. సాధారణంగా అవినీతి కేసుల్లో సీబీఐ కేసు నమోదైన ఏడాది లోగా దర్యాప్తు పూర్తిచేయాల్సి ఉంటుంది. అయితే, అధిక పనిభారం, సిబ్బంది కొరత, సుదూర ప్రాంతాల్లో ఉన్న సాక్షుల చిరునామాలు గుర్తించి, వారిని ప్రశ్నించడం వంటి కారణాలతో సీబీఐ దర్యాప్తు ఆలస్యమవుతున్నట్లు సీవీసీ తమ నివేదికలో పేర్కొంది.

చంద్రయాన్-3 ల్యాండింగ్ 'చాలా క్లిష్టమైన యుక్తి'

ఇస్రో మాజీ అధ్యక్షుడు మాధవన్ నాయర్

బెంగళూరు : చంద్రుని ఉపరితలంపై బుధవారం చంద్రయాన్-3 మిషన్‌కు చెందిన ల్యాండర్ మాడ్యూల్ చాలా క్లిష్టమైన యుక్తి అని, దాని విజయం కోసం అన్ని వ్యవస్థలు ఏకతాటిపై పని చేయవలసి ఉంటుందని, అందువల్ల జాగ్రత్తగా ఉండాలని ఇస్రో మాజీ అధ్యక్షుడు మాధవన్ నాయర్ అన్నారు. 2008లో చంద్రయాన్-1 మిషన్‌ను ప్రారంభించినప్పుడు అంతరిక్ష సంస్థకు నేతృత్వం వహించిన నాయర్, విజయవంతమైన ల్యాండింగ్ ఇస్రో తదుపరి దశ గ్రహాల అన్వేషణకు పెద్ద ప్రారంభాన్ని తెలియజేస్తుందని చెప్పారు. 'ఇది చాలా క్లిష్టమైన యుక్తి. చివరి రెండు కిలోమీటర్లలో (చంద్రుని ఉపరితలంపై) మేము దానిని (చంద్రయాన్-2 మిషన్‌లో చంద్రునిపై మృదువైన ల్యాండింగ్) తృటిలో కోల్పోయాము' అని ఆయన సోమవారం పీటీఐకి తెలిపారు. 'ఏకగ్రీవంగా పని చేయాల్సిన అనేక విషయాలు ఉన్నాయి. థ్రస్టర్‌లు, సెన్సార్‌లు, ఆల్టిమీటర్‌లు, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, అన్ని విషయాలు. ఎక్కడైనా ఏదైనా పొరపాటు జరిగినా ఇబ్బందులు పడతాం' అని నాయర్ అన్నారు. 'మనం నిజంగా జాగ్రత్తగా ఉండాలి. గమనించాలి. వాస్తవానికి, ఇస్రో తగినన్ని అనుకరణలు చేసిందని, తొలగింపులు కూడా నిర్మించిందని నేను అర్థం చేసుకున్నాను. తద్వారా అటువంటి వైఫల్యానికి అవకాశాలు దూరంగా ఉంటాయి. అయినప్పటికీ, మనం చేయి దాటిపోకుండా జాగ్రత్త పడాలి' అని అన్నారు. ఇస్రో ప్రకారం, ల్యాండర్ మాడ్యూల్ రోవర్‌తో బుధవారం సాయంత్రం 6.04 గంటలకు చంద్రుని ఉపరితలంపై తాకే అవకాశం ఉంది. 'చంద్రుని ఉపరితలం నుంచి మనం సేకరించే సమాచారం కొన్ని ఖనిజాలను గుర్తించడంలో ఉపయోగపడుతుంది. అరుదైన ఖనిజాలు, ఏదైనా ఉంటే, హీలియం-3, మొదలైనవి. అలాగే, అన్వేషణ లేదా మానవ ఉనికి కోసం చంద్ర దక్షిణ ధ్రువం దగ్గర మనం ఏ రకమైన ఏర్పాటును కలిగి ఉండవచ్చనే దానిపై కొన్ని పరిశోధనలు చేయడానికి కూడా ప్రయత్నించవచ్చు. ఇది (విజయవంతమైన మృదువైన ల్యాండింగ్) ఇస్రో తదుపరి దశ గ్రహ అన్వేషణకు పెద్ద ప్రారంభం కానుంది' అని అన్నారు.

మణిపూర్ అసెంబ్లీ భేటీపై సందిగ్ధం

(మొదటిపేజీ తరువాయి)

సమావేశం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం సమావేశాలను కోరింది. 'మణిపూర్ రాష్ట్ర 12వ శాసనసభ 4వ సమావేశాలను 2023 ఆగస్టు 21న ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం మణిపూర్ గవర్నర్‌కు సిఫార్సు చేసింది' అని ఆగస్టు 4న అధికారిక ప్రకటన తెలిపింది. గత మార్చిలో అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. మేలో హింస చెలరేగింది. 'చివరి అసెంబ్లీ సమావేశాలు మార్చిలో వాయిదా పడ్డాయి. తదుపరి సమావేశాలను సెప్టెంబరు 2 లోపు నిర్వహించడం రాజ్యాంగబద్ధమైన బాధ్యత' అని మరో అధికారి తెలిపారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ శాసనసభా పక్ష నాయకుడు ఓ ఇబోబి సింగ్ మాట్లాడుతూ 'కేబినెట్ సిఫార్సు చేసిన తర్వాత కూడా అసెంబ్లీ సమావేశాలు జరగలేదు. అసెంబ్లీ ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమావేశం కావడం తప్పనిసరి' అని అన్నారు. కేబినెట్ సిఫారసు చేసినప్పటికీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాలేదు.కుకీ ఎమ్మెల్యేలు సమావేశాలకు హాజరుకావడానికి అంగీకరిస్తారా లేదా అనేది అస్పష్టంగా ఉంది. 'ప్రస్తుతం ఉన్న శాంతిభద్రతల పరిస్థితుల దృష్ట్యా రాబోయే సమావేశాలకు హాజరుకావడం నా వంతుగా సాధ్యం కాదు' అని చురాచంద్‌పూర్ బీజేపీ ఎమ్మెల్యే ఎల్ఎం.ఖౌటే ఇంతకు ముందు టెలిఫోన్ ఇంటర్వ్యూలో చెప్పారు. 'హింస, ప్రత్యేక పరిపాలన కోసం కుకీలు చేసిన డిమాండ్లకు పరిష్కారం లేకుండా 'కుకీ-జోమి-హార్ ఎమ్మెల్యేలు అందరూ సమావేశాలకు హాజరు కావడం సాధ్యం కాదు' అని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నాగా శాంతి చర్చలకు ఆటంకం కలిగిస్తోందని భావించినందున తాము సమావేశానికి హాజరు కావడం లేదని నాగా ఎమ్మెల్యేలు కూడా చెప్పారు. ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ ఇంతకుముందు మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబరు 2 లోపు అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

శరద్ పవార్ మా నేతగా కొనసాగుతారు

ఎన్‌సీపీ మంత్రి దిలీప్ వాల్సే

పూణే : శరద్ పవార్ మా నాయకుడిగా కొనసాగుతారని ఎన్‌సీపీ మంత్రి దిలీప్ వాల్సే పాటిల్ అన్నారు. గత నెలలో అజిత్ పవార్‌తో పాటు మహారాష్ట్రలోని ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని ప్రభుత్వంలో ఆయన చేరిన విషయం తెలిసిందే. పార్టీ వ్యవస్థాపకుడు తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రభుత్వం ఏర్పాటుకు ఒక 'స్పష్టమైన మెజార్టీ' ని కూడగట్టలేకపోయాడంటూ మీడియాలో వచ్చిన వార్తలపై వాల్సే ధ్వజమెత్తారు. పూణే జిల్లాలో ఒక బహిరంగ సభలో సోమవారం ఆయన మాట్లాడుతూ శరద్ పవార్‌పై తాను చేసిన వ్యాఖ్యలను మీడియా తప్పుగా అర్థం చేసుకుందని అన్నారు. శరద్ పవార్ భవిష్యత్తులో కూడా తన నాయకుడిగా ఉంటారని, 82 ఏళ్ల అనుభవజ్ఞుడి పట్ల గౌరవం తన మనస్సులో చిరస్థాయిగా ఉంటుందని తెలిపారు. ఆదివారం తన అసెంబ్లీ నియోజకవర్గం అంబేగావ్‌లోని మంచర్‌లో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి వాల్సే-పాటిల్ మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రజలు శరద్ పవార్‌కు సొంతంగా అధికారం ఇవ్వలేదని లేదా ఒంటరిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతించలేదని తెలిపారు. కాగా, రాష్ట్ర సహకార మంత్రి, శరద్ పవార్ మాజీ సన్నిహితుడు అయిన దిలీప్ వాల్సే మాట్లాడుతూ 'మీడియా తప్పుగా అర్థం చేసుకుందని నేను భావిస్తున్నాను. పవార్ సాహెబ్ గురించి నేనెప్పుడూ చెడుగా మాట్లాడలేదు. ఇతర ప్రాంతీయ పార్టీలు సొంతంగా అధికారం సాధించగా, మహారాష్ట్ర ప్రజలు ఆయనకు అధికారం ఇవ్వలేదని నేను విచారం వ్యక్తం చేస్తున్నాను. పవార్ సాహెబ్‌ను కించపరచడం లేదా అతని సామర్థ్యాన్ని ప్రశ్నించడం అనే ప్రశ్నే లేదు' అని అన్నారు. 'తమ అత్యున్నత నాయకుడిగా ఉన్నప్పటికీ, మహారాష్ట్ర ప్రజలు పూర్తి బలంతో ఆయన వెంట నిలబడలేదు. దీనిపై నా అసంతృప్తిని వ్యక్తం చేశాను. నేను దాని గురించి మాట్లాడటం ఇదే మొదటిసారి కాదు. పార్టీ సమావేశాలతో సహా గతంలో కూడా ఇదే చెప్పాను. నేను పవార్ సాహెబ్‌ను తప్పుగా మాట్లాడడం లేదా విమర్శించడం అసాధ్యం. ఈ అపార్థానికి నేను చింతిస్తున్నాను' అని అన్నారు.

'ఇండియా' ముంబై భేటీకి హాజరవుతాం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీపై పోరాటానికి ఏర్పడిన ప్రతిపక్షాల ఇండియా కూటమి మూడో సమావేశం ముంబైలో జరుగుతుందని, ఈ భేటీకి తాము హాజరవుతున్నామని ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సోమవారం ప్రకటించారు. కూటమి వ్యూహం ఏమిటనే దానిపై ఆ తర్వాత తెలియజేస్తామని చెప్పారు. ఢిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాల్లో విజయం కోసం సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు కాంగ్రెస్ పిలుపునివ్వడంతో ఆ పార్టీ నేతలు, ఆప్ నేతల మధ్య మాటలయుద్ధం జరిగిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ తాజా ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఆగస్టు 31, సెప్టెంబర్ 1వ తేదీల్లో ముంబైలో ఇండియా కూటమి సమావేశం జరగనుంది. అరవింద్ కేజ్రీవాల్ ఇటీవల చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచార ర్యాలీల్లో అటు బీజేపీని, ఇటు కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. మధ్యప్రదేశ్‌లో జరిగిన ర్యాలీలో రాష్ట్రాన్ని రెండు పార్టీలు (బీజేపీ, కాంగ్రెస్) గత 75 ఏళ్లుగా పాలిస్తున్నాయని, ఏ పార్టీ కూడా రాష్ట్రానికి కరెంటు ఇవ్వలేకపోయిందని విమర్శించారు. 'మీకు పవర్ (విద్యుత్) సరఫరా కావాలంటే ఆప్‌కు ఓటేయండి. పవర్ అక్కర్లేదనుకుంటే ఆ రెండు పార్టీలకే వేయండి' అని ప్రజలకు పిలుపునిచ్చారు.

చరిత్ర, సంస్కృతి, భాషపై దాడిని తిప్పికొడదాం

ప్రొఫెసర్ రామ్ పునియాని

(జబల్పూరు నుంచి మోతుకూరి అరుణకుమార్)

భారతీయ సంస్కృతి, భాష చాలా గొప్పవని, చారిత్రక నేపథ్యం ఉందని, కానీ నేడు చరిత్ర, సంస్కృతిపై మనువాద దాడి జరుగుతోందని, మతం, భాష పేరుతో విద్వేషాలు సృష్టిస్తున్నారని ప్రముఖ మార్క్సిస్టు తత్వవేత్త ప్రొఫెసర్ రామ్ పునియాని అన్నారు. అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం 18వ జాతీయ మహాసభల సందర్భంగా రెండో రోజు సోమవారం అనేక అంశాలపై సదస్సులు, పుస్తకావిష్కరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుండి పాల్గొన్న అరసం ప్రముఖులు ప్రసంగించారు. రామ్ పునియా మాట్లాడుతూ సామాజిక సమస్యలపై పోరాటానికిగాను సాహిత్య రంగానికి మంచి పదును పెట్టాలని సూచించారు. దేశ సమైక్యత, సమగ్రతల పరిరక్షణ, రాజ్యాంగ లక్ష్యాల సాధన అవశ్యకత ఉందని అన్నారు. విద్యా వ్యవస్థలో మార్పుల పేరుతో కాషాయీకరణ

జరుగుతోందని విమర్శించారు. పాఠ్యాంశాల నుంచి గాంధీజీ, భగత్‌సింగ్, డార్విన్ సిద్ధాంతం వంటి చారిత్రక అంశాలను తొలగిస్తున్నారని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం రచయితలు, ప్రశ్నించే మేధావులపై దాడులు చేస్తోందని, అక్రమ కేసులు బనాయిస్తూ జైళ్లలో నిర్బంధిస్తోందని, దభోల్కర్, కల్బుర్గి, గోవింద పన్సారే, గౌరీ లంకేశ్ వంటి మేధావుల హత్యలే ఇందుకు నిదర్శనమని చెప్పారు. మణిపూర్ మారణకాండపై ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ప్రచురించిన ద్విభాషా సంకలనం 'మణిపూర్ మంటలు', 'అక్షరమా నీకు వందనం' పుస్తకాలను అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివ ప్రసాద్ ఆవిష్కరించారు. అరసం రాష్ట్ర కమిటీ సభ్యులు జి.ఓబులేసు, ఏఎంఆర్ ఆనంద్, బి.నాగార్జున సాగర్, మోతుకూరి అరుణకుమార్, బంగారు ఆచార్యులు, ఈశ్వరరెడ్డి తదితరులు ఆవిష్కరణలో పాల్గొన్నారు. తమిళనాడుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, అమరులు టి.జీవానందం 116వ జయంతిని పురస్కరించుకొని అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుబ్రమణ్య భారతి సాహిత్యాన్ని ఆలపించారు. సామ్రాజ్యవాద కబంధ హస్తాల నుండి క్యూబా దేశాన్ని రక్షించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆ దేశ ప్రతినిధి కోరారు. మణిపూర్ నుండి హాజరైన ప్రతినిధులు అక్కడి పరిస్థితులపై వివరించారు. అరసం జాతీయ ప్రధాన కార్యదర్శి సుఖదేవ్ సింగ్, కార్యదర్శి వినీత్ తివారీ, సయ్యద్ హమీద్ నారాయణ కౌర్ (ఢిల్లీ), వీరేంద్ర యాదవ్(యూపీ) తదితరులు పాల్గొన్నారు.

26న మంగళగిరికి సీపీఐ బస్సు యాత్ర

జయప్రదానికి జంగాల అజయ్ పిలుపు

విశాలాంధ్ర-మంగళగిరి: 'రాష్ట్రాన్ని రక్షించండి - దేశాన్ని కాపాడండి' అన్న నినాదంతో సాగుతున్న సీపీఐ బస్సు యాత్ర జయప్రదానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం అనగా 26వ తేదీ సాయంత్రం 5 గంటలకు బస్సు యాత్ర మంగళగిరి చేరుతుందని, ఆపై జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను అడ్డుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టు సత్వరమే పూర్తి చేయాలని, అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించాలి, ఏపీకి ప్రత్యేకహోదా, ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని జంగాల అజయ్ డిమాండ్ చేశారు. యువజన, విద్యార్థుల ఉపాధి కల్పన కోసం నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర పార్టీ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య డిమాండ్ చేశారు. ఖాళీల భర్తీ, మహిళలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలపై దాడులు అరికట్టాలని, రాయలసీమ, ఉత్తరాంధ్రలో నిర్మాణం-పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్లులను అమాంతం పెంచి ప్రజలపై మరింత భారాలు మోపుతున్నారని, పెట్రోల్ డీజిల్ ధరలు, నిత్యవసరాల ధరలు సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయని తెలిపారు. 26, 27 తేదీల్లో జరిగే బస్సు యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బహిరంగ సభలో ప్రజాసంఘాలు, ప్రతిపక్షాలు, సీపీఐ శ్రేణులు, రైతులు, కూలీలు, కార్మికులు, మేధావులు పాల్గొనాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి పత్తెవరపు వెంకటశివప్రసాద్ మాట్లాడుతూ మూడు రాజధానులంటూ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేస్తున్నారన్నారు. బస్సు యాత్ర జయప్రదానికి పిలుపునిచ్చారు. అనంతరం సీపీఐ ప్రచార జాతా - బస్సు యాత్ర వాల్‌పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అన్నవరపు ప్రభాకర్, నందం బ్రహ్మేశ్వరరావు, చిన్ని సత్యనారాయణ, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, బత్తూరి మోహన్ రావు పాల్గొన్నారు.

యువతరం ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి

భాష్యం ఆలిండియా ర్యాంకర్ల సన్మాన సభలో వెంకయ్యనాయుడు

విశాలాంధ్ర-గుంటూరు: యువతరం ప్రతిభను గుర్తించి అభినందించి ప్రోత్సహించడం ద్వారా భావితరాల్లో స్ఫూర్తిని నింపినట్లు అవుతుందని పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. సోమవారం భాష్యం విద్యాసంస్థల అధ్వర్యంలో జాతీయ స్థాయిలో 5, 10 ఆలిండియా ర్యాంకులు సాధించిన భాష్యం ఐఐటి జేఈఈ అకాడమీ విద్యార్థులు ఎ.వెంకటశివరాం, వైవీ మణీందర్ రెడ్డికి జరిగిన అభినందన సభకు వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ బాల్యం, యవ్వనం చాలా అమూల్యమైనవని, ఎంతో ఉత్సాహాన్ని, ప్రేరణను కలిగిస్తాయ న్నారు. తాను పదవీ విరమణ చేశానే కానీ పెదవి విరమణ చేయలేదని, దేశవ్యాప్తంగా తిరుగుతూ ప్రజలతో మమేకమై వారిని కలవడం, మాట్లాడడం తనకు ఎంతో ఇష్టమైన చర్యగా వెంకయ్యనాయుడు అభివర్ణించారు. ఈ దేశ, రాష్ట్ర భవిత యువత చేతుల్లోనే ఉందన్నారు. మంచి నడవడిక, క్రమశిక్షణతో చదివి అనుకున్న లక్ష్యాలను సాధించి ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. మాతృ భాష, మాతృ భూమి, విద్య నేర్పిన గురువులు, విద్యాసంస్థలను ఎప్పటికీ మరువకూడదన్నారు. విద్యార్థులందరూ ఉన్నతమైన భవిష్యత్తు కోసం క్రమశిక్షణను అలవరచుకుని లక్ష్యసాధన దిశగా ఎందరో మహనీయులు అందించిన స్ఫూర్తిని నింపుకుని ముందుకు సాగాలన్నారు. భాష్యం స్థాపించిన 30 సంవత్సరాల కాలంలో అంచెలంచెలుగా, శాఖోపశాఖలుగా ఎదిగి దేశ, రాష్ట్ర స్థాయిలో ఖ్యాతిని ఆర్జించిందంటే దాని వెనుక ఎంతో కఠోర శ్రమ, అంకితభావం, క్రమశిక్షణ ఉన్నాయని తెలిపారు. ఇష్టపడి కష్టపడితే నష్టపడేది లేదని, దీనిని ప్రతి విద్యార్థి ఆచరిస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. మంచి పనులు చేయడం ద్వారా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని, ఇందుకు ఎన్టీఆర్ జీవితం ఒక ఉదాహరణగా ప్రస్తావించారు. మానవుడు సంఘ జీవి అని అన్నారు. యువత సామాజిక స్పృహను పెంపొందించుకుని మన పూర్వీకులు మనకందించిన భారతీయ సనాతన సంస్కృతిని పక్కనవాళ్లతో పంచుకో... మమకారం పెంచుకో ఈ నానుడిని ఆచరించి చూపాలన్నారు. ప్రకృతిని, తల్లిదండ్రులను ప్రేమిస్తూ పరిరక్షించుకోవాలని సూచించారు. విదేశీ వ్యామోహాన్ని విడనాడి స్వదేశీ ప్రేమను పెంచుకోవాలన్నారు. ఎన్ని భిన్నత్వాలు ఉన్నా మనమంతా ఒక్కటేనని, ఈ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. చంద్రయాన్ ప్రయోగం విజయవంతం చేయడం ద్వారా మన శాస్త్రవేత్తలు దేశానికే గర్వకారణంగా నిలిచారని తెలిపారు. విద్యాసంస్థలు విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణను, సరైన దినచర్యను నేర్పి ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులు సాంకేతికతను నేర్చుకోవాలని, కానీ దానికి బానిసలు కాకుండా సృజనాత్మకతను పెంపొందించుకోవాలన్నారు. తొలుత వెంకయ్యనాయుడు చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. జాతీయ స్థాయిలో ఆలిండియా ర్యాంకులు సాధించిన ఎ.వెంకటశివరాం, వైవీ మణీందర్రెడ్డిని వెంకయ్యనాయుడు దుశ్శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. సభకు వీరేంద్ర చౌదరి స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, ముఖ్య సలహాదారు మైఖేల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రామసుబ్బయ్య ఆదర్శమూర్తి

విగ్రహావిష్కరణలో రావుల వెంకయ్య

విశాలాంధ్ర-చల్లపల్లి: కమ్యూనిస్టు సిద్ధాంతాలకు అంకితమైన వ్యక్తి మల్లు పెద్ది రామసుబ్బయ్య అని అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య కొనియాడారు. భావి తరాలకు ఆయన ఆరధ్యమన్నారు. కృష్ణాజిల్లా, చల్లపల్లి మండలం, వక్కలగడ్డలో ఆ గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన రామసుబ్బయ్య కాంస్య విగ్రహాన్ని శాసనసభ్యుడు సింహాద్రి రమేశ్ బాబుతో కలిసి వెంకయ్య ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీని అచంచలశక్తిగా తీర్చిదిద్దిన చంద్ర రాజేశ్వరరావు అనుచరుడిగా ఈ ప్రాంతంలో కమ్యూనిస్టులను తయారు చేసిన మహోన్నత వ్యక్తి రామసుబ్బయ్య అని శ్లాఘించారు. రామసుబ్బయ్య విగ్రహాన్ని కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయడం భావితరాలకు ఆయన ఆశయాలను గుర్తు చేయడమేనన్నారు. గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నెలకొల్పడంలో ఆయన కృషి అనిర్వచనీయమన్నారు. నేటితరం నాయకులు ఆయన అడుగుజాడల్లో నడుచుకోవడం అవసరమన్నారు. వక్కలగడ్డ సహకార సంఘం రాష్ట్రానికి ఆదర్శమన్నారు. సహకార వ్యవస్థ బలంగా ఉంటేనే రైతాంగం అభివృద్ధి సాధ్యమని నమ్మిన రామసుబ్బయ్య వక్కలగడ్డ సహకార సంఘాన్ని అభివృద్ధి పథంలో పయనించేందుకు నిర్విరామంగా పనిచేశారన్నారు. అంకితభావంతో పనిచేసే వ్యక్తులు ఉన్నప్పుడే సహకార సంఘాలు అభివృద్ధి చెందుతాయని, రామసుబ్బయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లే విధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సింహాద్రి రమేశ్ బాబు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం మల్లు పెద్ది రామసుబ్బయ్య నిర్వహించిన పాత్ర అమోఘమన్నారు. గ్రామ అభివృథే ధ్యేయంగా పనిచేసిన ఆయన నేటితరం నాయకులకు స్ఫూర్తి అని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ వక్కలగడ్డలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి, సహకార సంఘ అభివృద్ధికి రామ సుబ్బయ్య ఎనలేని కృషి చేశారని కొనియాడారు. వక్కలగడ్డ సొసైటీ అధ్యక్షుడిగా, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్‌గా చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాతయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు హనుమాన్ల సురేంద్రనాథ్ బెనర్జీ, ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ నజరానా, జెడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి, ఘంటసాల మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ వేమూరు వెంకటరావు, గ్రామ సర్పంచ్ వల్లూరి ఉమా, సీపీఐ నాయకులు గుత్తికొండ రామారావు, పాలడుగు రత్నబాబు, మల్లు పెద్ది బోసు, అట్లూరి వెంకటేశ్వర రావు, మల్లుపెద్ది రత్నకుమారి, రామసుబ్బయ్య కుటుంబ సభ్యులు మల్లుపెద్ది అజయ్ కుమార్, హనుమానుల రాణి కుమారి పాల్గొన్నారు.

సామల మనస్వినికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కురుపాం: అమ్మ ఒడి సభలో పిట్ట కొంచెం కూత ఘనం అన్న చందంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎదుట అనర్గళంగా ఆంగ్లంలో మాట్లాడుతూ అందరినీ ఆకట్టకునీ త్వరలో ఐక్యరాజ్యసమితి వేదికపై నుంచి మాట్లడే అవకాశం దక్కించుకున్న కురుపాం నియోజకవర్గంలోని గుమ్మలక్ష్మీ పురం కస్తూర్బా బాలికల విద్యాలయ విద్యార్థిని సామల మనస్విని ని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణీ, జిల్లా వైసీపీ అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు తమ నివాసంలో ఘనంగా సత్కరించారు. అమెరికా పర్యటన నిమిత్తం 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. అంతర్జాతీయ వేదికపై ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక గుర్తింపు తీసుకుని రావాలని ఆకాంక్షిస్తూ... ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సెప్టెంబర్ 18,19 తేదీల్లో న్యూయార్క్ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో ఆంధ్రప్రదేశ్‌లో నూతన విద్యా సంస్కరణల పై మనస్విని మాట్లాడనుంది. ఈ అరుదైన అవకాశం సొంతం చేసుకున్న సామల మనస్విని ని పార్వతీ పురం మన్యం కలెక్టర్ నిషాంత్ కుమార్ , జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్ అభినందించారు. మనస్విని ఐక్యరాజ్య సమితి వేదికపై మాట్లాడే అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకోవటం మొత్తం కస్తూర్బా బాలికా విద్యాలయ (కేజీబీవీ) వ్యవస్థకే గర్వకారణమని ప్రిన్సిపాల్ చుక్క శ్రీరంజనీ తెలిపారు. విద్యతో పాటు ఆసక్తిగల ఇతర రంగాల్లోను విద్యార్థులను తీర్చిదిద్దేందుకు మరింత ఉత్సాహం నింపినట్లయిందన్నారు.

ఇంగ్లీషు మీడియం టీచర్లకు ప్రత్యేక అవార్డులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధ్యాయ దినోత్స వాన్ని పురస్కరించుకుని ఇంగ్లీషు మీడియం బోధనా నైపుణ్యాలలో ప్రతిభ చూపుతున్న ఉపాధ్యాయులకు అదనపు కేటగిరీ అవార్డుల ఎంపికకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇంగ్లీషు మీడియంలో బోధించే ప్రతిభగల ఉపాధ్యాయుల కృషిని అదనంగా గుర్తించి, వారిని అవార్డులతో సత్కరించేందుకు సిద్ధమైంది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇంగ్లీషు మీడియంలో బోధనా సామర్థ్యాలను చూపుతున్న ఉపాధ్యాయులను ఈ అవార్డుల కోసం ప్రత్యేక కేటగిరీగా విభజించనుంది. ఈ మేరకు పాఠశాల విద్యా ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సోమవారం ఉత్తర్వులు జారీజేశారు. రాష్ట్ర స్థాయిలో ఈ అవార్డుల్ని అందజేస్తారు. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో అవార్డుల్ని ఎంపిక చేస్తారు. ఈ కేటగిరీ అవార్డులు ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవం నాడు ఇచ్చే అవా ర్డులకు అదనంగా అందిస్తారు. ఇందు కోసం సెంటర్ ఫర్ టీచర్ అక్రిడిటేషన్ (సెంటా) ప్రైవేట్ లిమిటెడ్‌తో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం భాగస్వామ్యమైంది. సెంటా అనేది ఉపాధ్యా యుల కోసం ప్రపంచంలోని అతిపెద్ద ప్రొఫెషనల్ వేదికల్లో ఒకటిగా ఉంది.

అది 1.3 మిలియన్ల ఉపాధ్యాయులతో ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి కార్యకలాపాల్ని నిర్వహిస్తోంది. ఉపాధ్యాయుల శిక్షణ, ఉపాధ్యాయుల అక్రిడిటేషన్‌లో నైపుణ్యాన్ని కలిగి ఉంది. టీచింగ్ కోషియంట్ టెస్ట్ ఆధారంగా, ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఈ అవార్డుల కోసం ఉపాధ్యాయులను ఎంపిక చేయడానికిగాను ఇది ప్రభుత్వానికి సహాయ పడుతుంది. ఇంగ్లీషు మీడియంలో బోధనా నైపుణ్యాలను కనబరుస్తున్న ఉపాధ్యాయులు అదనపు కేటగిరీ అవార్డులలో పేర్లను ఖరారు చేయడానికి ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతారు. ప్రభుత్వ పాఠ శాలల పిల్లలకు మన దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి కల్పించేందుకు నాణ్యమైన విద్యను అందించే చర్యల్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన విషయం విదితమే. 2019 నుంచి 1వ తరగతి నుంచే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా మాధ్యమంగా ఇంగ్లీషును ప్రవేశపెట్టింది. దీనిని మరింత అభివృద్ధి చేసే క్రమంలో ద్విభాషా పాఠ్యపుస్తకాలు, ఉపాధ్యాయులకు శిక్షణతోపాటు 3వ తరగతి నుంచి సబ్జెక్ట్ ఉపాధ్యాయులు, ద్విభాషా రూపాల్లో సంబంధిత సబ్జెక్టులలో ఆడియోవిజువల్ కంటెంట్‌ను అందించే చర్యలకు ఉపక్రమించింది. ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీస్, ప్రిన్స్‌టన్, ఆంగ్ల భాషా నైపుణ్యాలను మెరుగుపరచడం మొదలైనవాటితో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వం యొక్క ఈ నిరంతర ప్రయత్నాల కారణంగా, 3 నుంచి 9వ తరగతి వరకు 91.33 శాతం మంది విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో వారి మొదటి నిర్మాణాత్మక అంచనా (ఎఫ్ ఏ 1) పరీక్షలను దిగ్విజయంగా రాశారని, ఇంగ్లీషు మాధ్యమంలో అధ్యాపకుల అపూర్వ కృషి వల్ల ఇది సాధ్యమైందని ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. ఈ ప్రత్యేక అవార్డుల ఎంపిక కోసం పాఠశాల విద్యా కమిషనర్, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రేపు ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీఈఏపీసెట్)-2023 ఇంజనీరింగ్, ఫార్మసీ (ఎంపీసీ స్ట్రీమ్) సీట్లను రేపు (23వ తేదీ) వెల్లడించనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులంతా అదే రోజు నుంచి, ఈ నెల 31 సాయంత్రం 5 గంటల లోపు ఆయా కళాశాలల్లో తమ వ్యక్తిగత ప్రవేశ వివరాలను నివేదించాలి. వారందరికీ 31 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. బైపీసీ స్ట్రీమ్ వారికి మాత్రం ప్రత్యేకంగా కౌన్సెలింగ్ షెడ్యూల్ జారీజేస్తారు.

ఫైళ్లను లాగేసుకున్నారు.. ఇక సమస్యలు విన్నవించేదెలా...?

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న

విశాలాంధ్ర-విజయవాడ: ఏపీ ఎన్జీవో సమావేశానికి వచ్చిన ఉద్యోగులు, ఉపాధ్యాయులను ముఖ్యమంత్రిని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరాశపరిచారని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలను విన్నవించుకునేందుకు వచ్చిన వారి వద్ద నుంచి ఫైళ్లను లాగేసుకోవడం ప్రజాస్వామ్య వ్యతిరేకమని ఆయన విమర్శించారు. ఏపీ ఎన్జీవోల 21 వ కౌన్సిల్ సమావేశానికి జేఏసీ సభ్య సంఘాలు, జేఏసీ కార్యవర్గ సభ్యులను ఆహ్వానించారన్నారు. ఏపీ జేఏసీ రాష్ట్ర కో-చైర్మన్ హోదాలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం తరపున ఈ సమావేశానికి హాజరైనట్లు తిమ్మన్న తెలిపారు. సీఎం సమావేశానికి హాజరు కానుండటంతో ఉపాధ్యాయ ఉమ్మడి సర్వీసు నిబంధనలు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, పాఠశాల విద్యాశాఖలో జీవో 117 రద్దు, తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రాతినిధ్యాలు తయారు చేసుకొని వెళ్లినట్లు ఆయన తెలిపారు. అయితే వాటిని సెక్యూరిటీ అధికారులు గేటు దగ్గరే లాగేసుకోవడం దారుణమనన్నారు. కనీసం ప్రాతినిధ్యాలు తీసుకునే విధానం కూడా లేకపోవడం అత్యంత బాధాకరమని, అలాంటప్పుడు ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు ఏ విధంగా పరిష్కారం చేస్తారని ప్రశ్నించారు. ముఖ్య అతిథిగా వచ్చిన సీఎం పాత పెన్షన్ పునరుద్ధరణ పైన, 12వ వేతన సవరణ మధ్యంతర భృతి పైన, ఏదో ఒక తీపి కబురు చెబుతారని ఎదురు చూశామని పేర్కొన్నారు. సీఎం ప్రసంగం విన్న తర్వాత అత్యంత నిరాశకు లోనయ్యామని తెలిపారు. సీఎం ప్రసంగం ఆద్యంతం రాజకీయ సభలా సాగిందన్నారు. తన ప్రసంగంలో ప్రతిపక్ష నాయకులపై విమర్శలు, జీపీఎస్‌పైన ఆర్డినెన్స్ తెస్తామని అనడం, మూడు డీఏలు పెండింగ్ ఉంటే ఒకటి మాత్రమే దసరా కానుకగా ఇస్తామని ప్రకటించడం, ఉద్యోగులు, ఉపాధ్యాయులపై ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. సీపీఎస్, జీపీఎస్ రెండింటిని వ్యతిరేకిస్తున్నామని కేవలం పాత పెన్షన్ పునరుద్ధరణ తమ లక్ష్యమని, పాత పెన్షన్ సాధించేంతవరకు ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. రాబోవు సాధారణ ఎన్నికలలోపే పాత పెన్షన్ పునరుద్ధరణ చేసే విధంగా ఒత్తిడి తెస్తామని, ఉమ్మడి ఉద్యమాలు చేపడతామని పేర్కొన్నారు.

రఘువీరారెడ్డి నియామకంపై కాంగ్రెస్ సంబరాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)లో ఆ పార్టీ సీనియర్ నేత రఘువీరారెడ్డి నియామకాన్ని హర్షిస్తూ, సోమవారం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యాలయం ముందు కాంగ్రెస్ బీసీ నేతలు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, కాంగ్రెస్ నాయకులు తులసీరెడ్డి, వీ.గురునాథం, విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, నాయకులు పీవై కిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకున్నారు. డప్పు వాయిద్యాలతో సందడి చేశారు. కాంగ్రెస్ బీసీ నేత కొలనుకొండ శివాజీ మాట్లాడుతూ, కాంగ్రెస్‌ను వదిలివెళ్లిన నాయకులందరూ మళ్లీ పార్టీలోకి రావాలన్నారు. రాహుల్ గాంధీ, ఖర్గే ప్రవేశ పెట్టిన బీసీ డిక్లరేషన్‌కు మద్దతుగా బీసీలను సమీకరించి, 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌కి లాభం చేకూర్చాలని కోరారు.

గాడి తప్పిన శాంతి భద్రతలు: గిడుగు రుద్రరాజు

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక రాష్ట్రంలో శాంతి భద్రతలు గాడి తప్పాయని, బడుగు, బలహీన వర్గాలపై దాడులు పెరిగాయని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు విమర్శించారు. ఏపీ కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ తులసిరెడ్డితో కలిసి సోమవారం విజయవాడలోని ఆంధ్రరత్నభవన్‌లో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ప్రకాశం జిల్లా దర్శిలో దాడికి గురైన మౌనిక తల్లి అనురాధను తాను స్వయంగా పరామర్శించిన సందర్భాన్ని గుర్తు చేస్తూ, ఇప్పటికీ బాధితులు ప్రాణభయంతో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి కేసును పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. దాడి ఘటనపై పలకరించేందుకు లేదా పరామర్శించేందుకు కూడా వారి పొరుగున ఉన్న వారు గాని, గ్రామస్తులు గాని బాధితులతో మాట్లాడటానికి భయపడుతున్నారని తెలిపారు. సీఎం జగన్‌తో సహా, మహిళా హోం మంత్రి, సంబంధిత జిల్లా మంత్రి కూడా జరిగిన ఘటనపై ఇంత వరకు కనీసం స్పందించక పోవడం రాష్ట్ర ప్రభుత్వానికి దళితులపై ఉన్న చిత్తశుద్ధికి, కపట ప్రేమకు నిదర్శమని ఆయన తెలిపారు. నూతన సీడబ్ల్యూసీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రఘువీరారెడ్డి, సుబ్బిరామిరెడ్డి, పళ్లంరాజు, కే.రాజుకు స్థానం కల్పించడంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు గిడుగు రుద్రరాజు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, ఏఐసీసీ సభ్యులు వీ.గుర్నాధం పాల్గొన్నారు.

50 మందిని కిడ్నాప్ చేసిన మావోయిస్టులు

40 మంది విడుదల... ఇంకా చెరలో 10 మంది

బీజాపూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు... పూజలకు వెళ్లిన ఆదివాసీలను కిడ్నాప్ చేశారు. జిల్లాలోని ఫర్సేగఢ్ పోలీసు స్టేషన్ పరిధిలోని కుట్రూ గ్రామ అటవీ ప్రాంతంలో చీకటిరాజ్ గుట్టపై ఆదివారం ఈ ఘటన జరిగింది. వనదేవతకు పూజలు చేసేందుకు వెళ్లిన 50 మంది ఆదివాసీలను కిడ్నాప్ చేసి.. వెంటనే 40 మందిని విడిచిపెట్టారు. 10 మందిని మాత్రం తమ వద్దే బందీలుగా ఉంచుకున్నారు. బందీలైన వారిలో కుట్రూ గ్రామ మాజీ సర్పంచ్ మహేష్ కుమార్ గోటతో పాటు ఉపాధ్యాయులు, వ్యాపారస్తులు, సర్పంచులు, ఉపసర్పంచ్‌లు ఉన్నారు. వారిలో ఒకరిని హత మార్చినట్టు సమాచారం. అయితే కిడ్నాప్ ఎందుకు చేశారనే దానిపై స్పష్టత లేదు. తమ వారిని క్షేమంగా వదిలేయాలని బాధిత కుటుంబ సభ్యులు.. .మావోయిస్టులను వేడుకుంటున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు చీకటి రాజ్ కొండలు, అటవీ ప్రాంతాలలో కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఇది ఇలా ఉండగా నారాయణపురం జిల్లా ఓర్చ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం మట్పేడ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఒక మావోయిస్టు మృతి చెందాడు. ఘటనా స్థలం నుంచి ఆయుధాలు, మందు గుండు సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌ను నారాయణపూర్ ఏఎస్పీ నిఖిల్ రఖేదా ధ్రువీకరించారు. ఈ సంఘటన తర్వాత అటవీ ప్రాంతంలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

సంపాదకీయం

గుజరాత్ కోర్టుల విపరీత ధోరణి?!

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రచారంలోపెట్టిన గుజరాత్ నమూనా ఆ రాష్ట్రంలోని న్యాయస్థానాలకు కూడా వర్తిస్తున్నట్టుంది. దీనికి గుజరాత్ హైకోర్టు మినహాయింపు కాదు. ఏ న్యాయమూర్తి అయినా బాధ్యతలు చేపట్టే ముందు భారత రాజ్యాంగానికి నిబద్ధమై పనిచేస్తానని ప్రమాణం చేస్తారు. అంటే న్యాయమూర్తులు రాజ్యాంగం ప్రకారమే నడుచుకోవలసి ఉంటుంది. ఇందులో ఏ మత ప్రసక్తీ ఉండడానికి వీలులేదు. దేశంలో అత్యధిక సంఖ్యాకుల మాటే చెల్లాలన్న విచిత్రమైన, రాజ్యాంగ వ్యతిరేకమైన వాతావరణం ఆవరించి ఉన్నప్పుడు న్యాయమూర్తులు తీర్పులు చెప్పేటప్పుడు మతాన్ని ఆధారంగా చేసుకోవడం రాజ్యాంగానికి బద్ధుడనై ఉంటానని చేసిన ప్రమాణాన్ని ఉల్లంఘించడమే. పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణకోసం ప్రస్తుత పరిస్థితుల్లో న్యాయస్థానాలే ఆఖరి దిక్కుగా మారిన స్థితిలో న్యాయమూర్తులు రాజ్యాంగానికి బద్ధులై ఉండకపోవడం విషాదకరం. మతం ఆధారంగా తీర్పులు చెప్పడం అంటే పౌరుల ప్రాథమిక హక్కులను ఖాతరు చేయకపోవడమే. న్యాయమూర్తులు మతపరమైన నైతిక సూత్రాలకన్నా ప్రాథమిక హక్కులకు, రాజ్యాంగ నైతికతకే ప్రాధాన్యం ఇవ్వాలి. కానీ గుజరాత్‌లోని కింది కోర్టులనుంచి మొదలుపెట్టి హైకోర్టు దాకా మతపరమైన అంశాలకు, ప్రభుత్వానికి అనువుగా నడుచుకోవడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న సంఘటనలు ఇటీవల బాగా కనిపిస్తున్నాయి. ఒక మైనర్ బాలిక అత్యాచారానికి గురై గర్భం దాల్చింది. ఆ గర్భాన్ని తొలగించుకోవడానికి అనుమతించాలని న్యాయస్థానాలను ఆశ్రయించింది. చివరకు ఈ కేసు గుజరాత్ హైకోర్టు దాకా వెళ్లింది. ఆ హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న సమీర్ దవే మనుస్మృతికి అనుగుణంగా నడుచుకోవాలని సలహా ఇచ్చారు. "మీ అమ్మమ్మను, లేదా ముత్తవ్వను అడగండి. అప్పుడు అమ్మాయిలకు 14-15 ఏళ్లకే పెళ్లిళ్లు అయి పోయేవి. 17వ ఏడు వచ్చేసరికి పిల్లల్ని కనేవారు. అబ్బాయిలకన్నా అమ్మాయిలకే ముందే పరిణతి వస్తుంది. మనుస్మృతి మీరు చదవరు. కానీ చదవండి. ఈ విషయాలు తెలుస్తాయి" అని గంభీరమైన ఉపన్యాసం చెప్పారు తప్ప గర్భవిచ్ఛిత్తి చేయించుకోవడానికి వీలు లేదని 2023 జూన్ 20న తీర్పు చెప్పారు. ఇదే న్యాయమూర్తి 2023 జూన్ 9న మాత్రం మరో కేసులో గర్భ విచ్ఛిత్తికి అనుకూలంగా తీర్పు చెప్పడం ఇంకా విచిత్రం. ఒకే న్యాయమూర్తి ఒకే రకమైన కేసులో భిన్నమైన తీర్పులు ఇవ్వడానికి చిన్న తర్కం లేకపోలేదు. రెండు సందర్భాల్లోనూ గర్భ విచ్ఛిత్తి చేయించుకుంటామని కోరడానికి కారణం వారిద్దరూ 17 ఏళ్ల వాళ్లే. ఇద్దరూ అత్యాచారానికి గురైన వారే. జూన్ 20న తీర్పు చెప్పిన సందర్భంలో ఉన్న అమ్మాయికి 30 వారాల గర్భం ఉంటే జూన్ 9న తీర్పు చెప్పిన ఉదంతంలో అమ్మాయికి 20 వారాల గర్భం ఉంది. ఆరోగ్య కారణాలవల్ల 30వారాల గర్భ విచ్ఛిత్తికి నిరాకరించి ఉండవచ్చు. కానీ మనుస్మృతిని ఉటంకించడం న్యాయమూర్తి సమీర్ దవే భావజాలం ఏమిటో రుజువు అవుతోంది. న్యాయమూర్తి సమీర్ దవే ఈ వ్యాఖ్యలు ఆయన తాత్వికతంతధోరణి ఏమిటో తెలిపోతోంది. ఆయన రాజ్యాంగానికి ఏ మాత్రం నిబద్ధుడు కాలేదని తేలిపోయింది. న్యాయమూర్తి దవే లాంటి వారి వ్యాఖ్యలు వింటే మన న్యాయవ్యవస్థ మతపరమైందిగా తయారవుతోందని అనిపిస్తోంది. 30వారాల గర్భంతో ఉన్న వ్యక్తి చివరకు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గత శనివారం సుప్రీంకోర్టు నాయమూర్తులు బి.వి.నాగరత్న, ఉజ్జల్ భూయాన్ బెంచి గర్భ విచ్ఛిత్తికి అనుమతించింది. గుజరాత్ హైకోర్టు అనుమతి నిరాకరించడంవల్ల విలువైన సమయం వృథా అయిందని ఈ న్యాయమూర్తులు తీవ్రమైన వ్యాఖ్యలే చేశారు. పెళ్లి కాకుండా గర్భిణీ అయితే అది ప్రమాదకరమే కాదు, తీవ్ర మానసికవేదనకు దారితీస్తుందని న్యాయమూర్తులు తేల్చి చెప్పారు. "భారత సమాజంలో గర్భం ధరించడం నిజానికి ఆ జంటకే కాక, కుటుంబానికి, మిత్రులకు కూడా ఆనందదాయకమైంది. కానీ పెళ్లి కాకుండా, అందులోనూ అత్యాచారానికి గురై గర్భిణీ కావడం విపరీతమైన వ్యధనే మిగులుస్తుందని న్యాయమూర్తులు అన్నారు. అత్యాచారానికి గురి కావడమే బాధాకరమైనప్పుడు, గర్భం దాల్చడం తీవ్రవేదన కల్గిసిస్తుందని కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. ఎందుకంటే ఈ గర్భం స్వచ్ఛందమైందీ కాదు, తెలిసి జరిగింది కాదు అని న్యాయమూర్తులు చెప్పారు. వైద్యపరంగా గర్భ విచ్ఛిత్తి కోసం మనకు 1971 నాటి చట్టం ఉంది. దీని ప్రకారం సందర్భాన్నిబట్టి గర్భవిచ్ఛిత్తికి అనుమతించవచ్చు. శారీరక, మానసిక ఇబ్బందులు ఉన్నట్టయితే 20వారాలలోపు గర్భం తొలగించుకోవడానికి అనుమతి ఉంటుంది. ఈడురాని అమ్మాయిలు, అత్యాచారానికి గురైన బాలికలు అయితే 20 నుంచి 24 వారాల గర్భం ఉన్నా తొలగించుకోవచ్చు. గర్భస్థ పిండం సవ్యంగా లేకపోతే తల్లి ప్రాణం కాపాడడానికి గర్భ విచ్ఛిత్తి చేయించుకోవచ్చు. అంటే తల్లి ప్రాణం కాపాడడానికే మన చట్టం ప్రాధాన్యత ఇస్తుంది. శబరిమల కేసులో తీర్పు చెప్పినప్పుడు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ చేసిన వ్యాఖ్యలను ప్రత్యేకంగా పరిశీలించాలి. "అంబేద్కర్ ను చదివితే మనం స్వాతంత్ర్యానికి మరో పార్శ్వం చూడాల్సివస్తుంది. స్వాతంత్ర్య పోరాటంతో పాటు సామాజిక అభ్యున్నతికోసం కూడా సమాంతరంగా ఉద్యమం సాగింది. ఇది సమాజంలో అసమానతలను తొలగించడంకోసం కొనసాగిన ఉద్యమం. ఇది చారిత్రక తప్పిదాలను సరిదిద్దడానికి ఉద్దేశించిన ఉద్యమం. మౌలికమైన తప్పిదాలను ప్రాథమిక హక్కులను కల్పించడంవల్లే సరిదిద్దగలం. ఈ రెండురకాల ఉద్యమాల ఫలితమే భారత రాజ్యాంగం" అని చంద్రచూడ్ విడమర్చారు. 1927 డిసెంబర్ 25న డా.అంబేద్కర్ మనుస్మృతిని దగ్ధం చేశారు. ఆ రోజును మనుస్మృతి దహనదినం, స్త్రీ విముక్తి దివస్‌గానూ జరుపుతున్నాం. మనుస్మృతికి వ్యతిరేకంగా పోరాడకుండా స్త్రీవాదానికి విలువే ఉండదు. మనుస్మృతితో పోరాడదాలంటే మహిళలు స్వయం ప్రతిపత్తికోసం సంఘర్షణకు సిద్ధం కావలసిందే. గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి సమీర్ దవే ఈ లోతుపాతుల్ని పట్టించుకున్నట్టు లేదు. ఇటీవలికాలంలో గుజరాత్‌లోని కింది కోర్టుల నుంచి హైకోర్టు దాకా భిన్నరీతిలో వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తోంది. మోదీ ప్రభుత్వాన్ని విమర్శించే వారికి వ్యతిరేకంగా పనిగట్టుకుని గుజరాత్‌లోనే కేసులు దాఖలు చేస్తున్నారు. దీనికి 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా కర్నాటకలో మాట్లాడుతూ "మోసగాళ్లందరి ఇంటి పేరు మోదీయే ఎందుకుంటుంది" అని రాహుల్ అన్నందుకు గుజరాత్‌లో కేసు దాఖలు కావడమే దీనికి ప్రబల నిదర్శనం. కింది కోర్టు, సెషన్స్ కోర్టు, హైకోర్టు మెట్లెక్కినా ఈ పరువునష్టం కేసులో రాహుల్ గాంధీకి ఊరట కలగలేదు. చివరకు సుప్రీంకోర్టు ఆయనకు ఉపశమనం కల్పించింది. నిజానికి ఇదీ తాత్కాలికమే. ఆయనను దోషి అని తేల్చడం మీద స్టే విధించింది. రాహుల్ గాంధీ అసలు పోరాటం ఇంకా చేయవలసే ఉంది. న్యాయవ్యవస్థను లొంగదీసుకోవడానికి మోదీ చేస్తున్న ప్రయత్నానికి గుజరాత్‌లోని న్యాయస్థానాలు స్వచ్ఛందంగా సహకరిస్తున్నాయేమోనన్న అనుమానం కలుగుతోంది. గుజరాత్ కోర్టులు భిన్నంగా వ్యవహరించడం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది.

కొండెక్కిన పాలన

చింతపట్ల సుదర్శన్

రంగస్థలం

ఊరంతా బలాదూర్గ తిరిగి దొరికిందేదో తిని అవసరం ఉన్నా లేకపోయినా మొరిగి కూలిన ఇంటికి చేరింది డాగీ. అప్పటికీ అరుగు ఎక్కిన డాంకీ గోడకు ఆనుకుని మూలగడం వినిపించింది. డాంకీ మూలుగుతున్నదా, శాస్త్రీయ సంగీతాన్ని ముక్కలుగా విరిచేస్తున్నదా అన్నది మొదట అర్థం కాలేదు డాగీకి తర్వాత అది బాధలో వస్తున్న మూలుగు అని అర్థం అయింది. ఏంటి 'బ్రో' వర్షాల కారణంగా కండ్ల కలక, వైరల్‌ఫీవర్ తగులుకుంటున్నాయట. ఆ రెండింటిలో ఏదైనా వచ్చిందా ఏమిటి అనడిగింది డాగీ. ఆ రెండూ మనుషుల్తో కబడ్డీ ఆడుకుంటాయి కానీ గాడిదల జోలికి రావులే. ఇది మనుషులు చేసిన రౌడీయిజం, దుర్మార్గం అన్నది డాంకీ మూలుగు పెద్దదిచేసి. మనుషులా, రౌడీలా, దుర్మార్గులా అసలు ఏం జరిగిందో చెప్పు 'బ్రో' ఏం చెప్పను ఖర్మ. ఖర్మ సిద్ధాంతం మనుషులకే ననుకున్నా నాలాంటి డాంకీలనూ పట్టిపీడిస్తున్నట్టుంది. ఊరికే తిని తొంగోడమేనా? కూసింత కళాపోషణ అక్కర్లేదా? కళాపోషణ కేవలం మనుషుల జాగీరా తాత సొమ్మా అనుకున్నా 'బ్రో' అదే నా అవస్థకు దారితీసింది. కళాపోషణకంటే ఊరికే తిని తొంగోవడమే 'బెటర్' అని అర్థం అయింది అంది డాంకీ. మనుషుల్లో ఏ పనీ రానివాళ్లు రౌడీలు గానూ, ప్రభుత్వ సర్వీసు నుంచి రిటైరైనవారు కవులుగానూ మారుతున్నారు. మరి నువ్వేమిటి గాడిదవై ఉండీ కళాపోషకుడవవుదామనుకోవడం నాకు నచ్చలేదు. నీ మూలుగులు వింటే జాలి వేస్తున్నది, అవును బ్రో నేను చేసినపనికి నామీద నాకే 'సెల్ఫ్‌పిటీ' కలుగుతున్నది. అబ్బ మనుషులా.. వాళ్లు వెనకా, ముందూ చూడకుండా, ఇక్కడా అక్కడా తెలీకుండా దుడ్డు కర్రతో బాదారు. వెంటపడి తరిమారు 'బ్లూ క్రాస్' వాళ్లు ఉన్నారనే ధ్యాస లేకుండా, అరిచి 'గీ గీ' మన్నా చెవిని పెట్టక కొట్టారు 'బ్రో' అంది మరో జత మూలుగులు గాలిలోకి వదిలి డాంకీ. మనవాళ్లు ఈ మధ్య చట్టసభల్లో విషయం చెప్పకుండానే గంటలు గంటలు మాట్లాడుతున్నారు. నువ్వూ అలాగే అసలు సంగతి ప్రస్తావించకుండా కాలహరణం చేస్తున్నావు. చెప్తా చెప్తా అక్కడికేవస్తున్నా. సాయంకాలం ఇంకా పొద్దు మిగిలుంది కదా, చీకటి రౌడీలు వీధిలోకి రాలేదుకదా అని అలా చల్లగాలికి షికారుకు వెళ్తే నా లోపలి కళాకారుడు సంతోష పడ్తాడని సముద్రంకేసి వెళ్లా. ఆహా ఆ అలల సౌందర్యం, పడిలేచే కెరటాలు, గాలిపాడే గీతాలు ఎంత బాగా ఎంజాయ్ చేశానో అలా ఆ దృశ్యాన్ని కడుపునిండా నింపుకుని వచ్చేస్తే ఇప్పుడీ మూలుగులు ఉండేవికావు. బీచిలోంచి ఇసుకలో అలా నడుస్తూ దగ్గరలో ఉంది కదా కొండ, ఆ కొండని ఎక్కాలనే దుర్బుద్ధి పుట్టింది. ఎందుకూ కొండ ఎక్కడం నాలుక్కాళ్ల తీపుల కోసమా అంది డాగీ. కొండమీద ఏదో నిర్మాణాలు జరుగుతున్నవి కాదా సరదాగా చూసి వద్దామా అని మనుషుల కంటపడకుండా ఎక్కి వెళ్లా, మట్టికుప్పలు, ఇసుక పిరమిడ్లు, సిమెంటు బస్తాలు, అంతస్తులు నిలబెట్టే ఇనుపరాడ్లు చూస్తూ ఉంటే ఓ ఆడ లీడర్ పరివారంతో రావడం గమనించా. ఆమె నోటిదురుసు తెల్సిన వాణ్ణికదా ఓ మట్టికుప్ప వెనుక దాక్కున్నా. ఎవరా లేడి ఈ మధ్య కొడుక్కి కోటిన్నరపెట్టి కారు కొన్నావిడేనా అబ్బో ఆవిడ నోరు విప్పిందంటే నేనూ నా ఫ్రెండ్సంతా కలిసి అరచినదానికంటే ఎక్కువే. దాక్కుని మంచి పనిచేశావు డాగీ.

ఆవిడ కనబడకుండాపోయేసి మెల్లగా వెనక్కి తిరిగి రావడం మొదలుపెట్టాను. ఓ వెధవ నన్ను చూడనే చూశాడు. ఎక్కడ్నించి వచ్చిందిరా ఈ గాడిద 'ఇక్కడ కట్తున్నది అతిథిగృహమా, సచివాలయమా, అన్నయ్య స్వంత గృహమా అని ఆరాతీయడానికి దత్త పుత్రుడో, స్వంతకొడుకున్న పెద్దాయనో పంపించలేదుకదా పట్టుకోండిరా దీన్ని అని అరిచాడు. అక్కడ ఉండేవాళ్లంతా రౌడీ వెధవలేకదా నన్ను 'రౌండప్' చేశారు. రేపు ఎన్నికలకు తలలు పగలకొట్టే ట్రెయినింగ్ తీసుకుంటున్నారేమో నలుగురు రౌడీ వస్తాదులు నా వెంట పడ్డారు. ఇక చెప్పేదేముంది. నాకళాతృష్ణ చప్పున చల్లారింది. ఒళ్లు వాతలు తేలింది. చావు తప్పి కన్ను లొట్టపోకుండా తప్పించుకొచ్చాను. ఈ నొప్పులు తగ్గడానికి రేపు పశువుల ఆసుపత్రికి వెళ్లాల్సిందే అని మూలుగులు కంటిన్యూ చేసింది డాకీ.

పెద్దవాళ్ల వ్యవహారంలో గాడిదలు కూడా తల దూర్చాలా. కొండమీద బల్డింగులు కడితే నీకేం నష్టం, కష్టం. దేవుళ్లంతా కొండల మీదే కదా కొలువై ఉన్నారు. ప్రజలకు ఉచితాలు ఇచ్చి, అనేక పథకాలు, ఒట్ల కోసమే అయితే నేం, అమలుచేసే వాళ్లు దేవుళ్లు కారా కొండమీద కొలువుండ రాదా అన్నాడు అబ్బాయి అరుగు ఎక్కుతూ. డాంకీవై ఉండి సముద్రానికి వెళ్లడం ఎందుకో, కొండ ఎక్కడం దేనికో దబిడి దబిడి దెబ్బ తినడం ఎందుకో అన్నది డాగీ. నా బంగారు పుట్టలో వేలుపెడితే, నే కుట్టనా? అన్నదట చీమ. నా సరదా చట్టు బండలైంది. వీపు ఇండిగో విమానం మోతైంది అంది డాంకీ.

గుండ్రేవులతోనే కెసి కెనాల్ ఆయకట్టుకీ దుస్థితి!

వి. శంకరయ్య

నికర జలాల కేటాయింపులు వున్నప్పటికీ గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం అటకెక్కించినందుననే ఈ రోజు బేసిన్‌లో నీటిఎద్దడి ఏర్పడగానే కెసి కెనాల్ ఆయకట్టు రైతులు నీటికోసం వెంపర్లాడ వలసివస్తోంది. దశాబ్దాల తరబడి రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా నిత్య క్షామపీడిత ప్రాంతమైన రాయలసీమకు న్యాయం జరగలేదు. నేడు ఎత్తిపోతల పథకాలవద్ద ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేస్తేగాని రాష్ట్రప్రభుత్వం దిగిరాలేదు. విద్యుత్ చార్జీలు చెల్లించలేనిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం వుందంటున్నారు. అదే సమయంలో పులిచింతల పట్టిసీమ ఎత్తిపోతల పథకంవుంది కాబట్టి రెండింటి నుండి 9500 క్యూసెక్కులు నీళ్లు కృష్ణడెల్టాకు విడుదల చేస్తున్నారు. ఈ వెసులుబాటు రాయలసీమ రైతులకు లేదు. తుంగభద్రపై 20 టియంసిలు సామర్థ్యంతో గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం జరిగివుంటే ఇలాంటి అవకాశమూ రాయలసీమ వాసులకుదక్కేది. కురువృద్ధులు ఇంజనీర్ సుబ్బారాయుడు ఎంతో శ్రమించి రూపకల్పనచేసిన ఈ పథకం కాగితాలకే పరిమితం అయింది.

ట్రిబ్యునల్ కేటాయింపులు నుండి కొంత రాష్ట్రంలోనే సర్దుబాటు కాగా తుంగభద్ర నుండి 21.89 టియంసిల నికర జలాల కేటాయింపులు వున్నప్పటికీ రెండున్నర లక్షల ఎకరాల కెసి కెనాల్ ఆయకట్టుకు కేవలం 1.20 టియంసిల నీటినిల్వ సామర్థ్యం గల సుంకేసుల బ్యారేజీ ఒక్కటే వుంది. దేశంలోనే నికరజలాలు కేటాయింపులు వున్న ఏ ఆయకట్టుకు ఈ దుర్గతి వుండకపోవచ్చు. ఈ లోపు 2.975 టియంసిల సామర్థ్యంతో అలగనూరు బాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించినా నేడు అది పశువులమేత పొరంబోకుగా వుంది. దానికి వ్యయంచేసిన నిధులు కాంట్రాక్టర్లు అధికారగణం మేసేయగా ప్రస్తుతం ఓటికుండగా మిగిలింది. ఇది గతం.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కిరణ్ కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2013 నవంబర్‌లో గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణానికి డిపిఆర్ రూపొందించడానికి 54.95 లక్షల రూపాయల వ్యయంతో జీవో జారీ చేశారు. ఈ కాంట్రాక్టు హైదరాబాద్‌కు చెందిన సంస్థ దక్కించుకొని 2890 కోట్ల రూపాయలు వ్యయంతో 20 టియంసిలు నీటి నిల్వ సామర్థ్యం రిజర్వాయర్ నిర్మాణానికి డిపిఆర్ సమర్పించింది. 2014లో తెలుగుదేశంహయాం మొదలైన తర్వాత చంద్రబాబు నాయుడు గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం గురించి హామీఇచ్చినా అమలుకు రాలేదు. తెలంగాణతో ముడిపడి వున్నందున పైగా కెసిఆర్‌కు చంద్రబాబు నాయుడుకు వ్యక్తిగతంగావున్న స్పర్థల నేపథ్యంలో గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణంపై దృష్టిపెట్టే అవకాశం లేకుండాపోయింది. గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మించితే తెలంగాణలో జోగులాంబ గద్వాలజిల్లాలో మూడుగ్రామాలు పూర్తిగానూ, రెండు గ్రామాలు పాక్షికంగా ముంపుకు గురౌతాయి. మొత్తంమీద 2371 ఎకరాలు ముంపుప్రాంతంగా వుంటుంది.

చంద్రబాబునాయుడు పట్టిసీమ ఎత్తిపోతలపథకం నిర్ణీత వ్యవధిలో పూర్తిచేసి గోదావరి జలాలతో సీమ పొలాలు తడుపుతున్నానని పదేపదే చెప్పినా రాయలసీమ ప్రజలు నమ్మలేదు. తుదకు 2019 ఫిబ్రవరిలో గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణానికి టెండర్లు పిలవడం, ఈ లోపు ఎన్నికలు రావడంతో పనులు మొదలుకాలేదు. ఈ నేపథ్యంలో జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా వల్లెవేసిన మాటతప్పను మడమతిప్పను అనే హామీలు నమ్మిన రాయలసీమ ప్రజలు ఏకపక్షంగా తీర్పుఇచ్చారు. ఇప్పుడు పెనంమీద నుండి పొయ్యిలో పడ్డట్టయిందని వాపోతున్నారు. ముఖ్యమంత్రి పదవిచేపట్టిన జగన్మోహన్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌తో సత్సంబంధాలు కొనసాగించిన తరుణంలో వ్యూహాత్మకంగా వ్యవహరించి గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణానికి తెలంగాణనుండి అనుమతిపొందివుండవచ్చు. గోదావరి, కృష్ణ నదుల అనుసంధానంపై పలుదఫాలు ఇరువురు ముఖ్యమంత్రులు సమావేశమై చర్చలు సాగించినా గుండ్రేవుల ఊసేజాడలేదు. జగన్మోహన్‌రెడ్డి సర్కారుకు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ప్రాధాన్యతల్లో లేకపోవడం రాయలసీమకు శరాఘాటంగా మిగిలింది. ముఖ్యమంత్రి కెసిఆర్ మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సంస్థలు ఆస్తులు పంపకం పక్కనబెట్టి అవశేష ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కోట్లాది రూపాయలు విలువగల సెక్రటేరియట్ భవనాలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డినుండి సులభంగా స్వాధీనం చేసుకున్నారు. ఏపీకి చెంది ఒక్క అంశంలోనూ తెలంగాణ నుండి లాభపడిందిలేదు.

మరోవేపు ఎవరు సలహా ఇచ్చారో లేక జగన్మోహన్ రెడ్డి స్వయంగా నిర్ణయం తీసుకున్నారో ఏమో దిక్కుమాలిన రివర్స్ టెండర్ విధానం తెరమీదకువచ్చి ఒక్క జీవోతో అమలులో వున్న టెండర్లు అన్నీ రద్దుచేశారు. ఆఖరుకు ముఖ్యమంత్రి తండ్రి వైయస్ రాజశేఖరరెడ్డిహయాంలో జరిగిన టెండర్లు రద్దుఅయ్యాయి. తదుపరి 14 ప్రాధాన్యత ప్రాజెక్టులు ఎంపికకాగా అందులో గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణంవున్నా ఆచరణలో గుండు కొట్టించడం అందరికీ తెలిసిందే. అంతర్ రాష్ట్ర జలవివాదాలతో కూడిన రాయలసీమ ప్రాజెక్టుల అంశంలో చంద్రబాబునాయుడు కన్నా జగన్మోహన్ రెడ్డికి వెసులుబాటు అవకాశాలువున్నా నెరవేర్చలేకపోయాడు. గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం జరిగితే కర్నూలు పట్టణం దాహార్తి శాశ్వతంగా తీరుతుంది. ఉమ్మడి కర్నూలుజిల్లా పశ్చిమ ప్రాంతంలోని ప్రజలకు తాగునీరు అందుతుంది.

తాజాగా గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణవ్యయం 5500 కోట్లకు చేరిందంటున్నారు. మరింత కాలయాపన జరిగితే నిర్మాణ వ్యయంఎంత పెరుగుతుందో! కాగా తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం విచారణ జరుపుతున్న బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌ముందు కెసి కెనాల్‌కు గతంలో ట్రిబ్యునల్ కేటాయించిన నీటిని ఆంధ్రప్రదేశ్ బేసిన్ ఆవలకు తరలించుతోందని ఆ నీటికి కోతపెట్టి తనకు కేటాయించాలని విచారణాంశాల్లో ఒకటిగా చేర్చింది. బేసిన్ అంశాన్ని ప్రముఖంగా తీసుకువస్తోంది. కాని తనుమాత్రం గోదావరి జలాలను కృష్ణబేసిన్‌కు తరలించుతున్నా రాయలసీమకు చెందిన ఒక్క ఎమ్మెల్యే నోరుతెరిస్తే ఒట్టు. వీరందరికీ హైదరాబాద్‌లో స్థిరాస్తులున్నందున ఒక్కరూ రాజకీయంగా ప్రకటన ఇచ్చేందుకు సిద్ధంగా లేదు. తుదకు రాష్ట్రమంత్రులు కూడా నోరువిప్పడంలేదు. భవిష్యత్తులో ట్రిబ్యునల్ తీర్పు ఎలా వుంటుందో వేచి చూడాల్సిందే.

విశ్రాంత పాత్రికేయులు, సెల్: 9848394013

మణిపూర్ మారణహోమం సూత్రధారి తెలుగోడే ?

అడవి బిడ్డలపై ఆటవిక న్యాయం! నేడు దేశాన్ని నగ్నంగా నడిపించిన వారి అసలు చరిత్ర ప్రతి భారతీయుడు తెలుసుకు తీరాలి. క్రీస్తుపూర్వం 185 సంవత్సరం మౌర్య సామ్రాజ్యంలో పుష్యమిత్రశుంగ అనే బ్రాహ్మణుడు సైన్యాధ్యక్షుడుగా ఉండేవాడు. సింహాసనం కోసం మౌర్యచక్రవర్తి బృహద్రతను చంపి శుంగ సామ్రాజ్యాన్ని నెలకొల్పాడు. అప్పటివరకు మౌర్యుల ఏలుబడిలో బౌద్ధం విరాజిల్లిన భారత ఉపఖండంలో రక్తం ఏరులైపారింది. భారతదేశ చరిత్రలో.. పాలనతో పెనవేసుకుపోయిన మతహింస కారణంగా మొట్టమొదటి జాతి నిర్మూలనకు గురి అయ్యింది బౌద్ధం. బౌద్ధ సన్యాసుల రక్తంతో ఈ నేల ఇంకిపోయింది. లెక్కలేనన్ని బౌద్ధ ఆరామాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. బౌద్ధం ప్రాణభయంతో దేశ సరిహద్దులు దాటి వెళ్లిపోయింది. ప్రాచీన బౌద్ధ ఆరామాలు శైవ, వైష్ణవాలయాలుగా మార్చివేశారు. మత విద్వేషాలు రగిలించిన కార్చిచ్చులో ప్రపంచంలోనే మొట్టమొదటి విశ్వవిద్యాలయం, బౌద్ధారామం నలంద అగ్నికి ఆహుతి అయ్యింది. పదివేలమంది రెసిడెన్షియల్ విద్యార్థులు, రెండువేల మంది అధ్యాపకులుతో దేశ, విదేశీ విద్యార్థులతో ప్రపంచానికి జ్ఞానాన్ని పంచిన విశ్వ విద్యాలయం మంటల్లో కాలి బూడిద దిబ్బగా మారిపోయింది.

వరుస విధ్వంసాల్లో తక్షశిల, విక్రమశిల ధ్వంసం అయ్యాయి. ఈ మూడు విశ్వవిద్యాలయాల కారణంగా భారతదేశానికి విశ్వగురు అనే పేరువచ్చింది. ఇదిదేశ గత చరిత్ర. భారత స్వతంత్ర పోరాటంలో అన్ని మతాలు, కులాలు ఒక్కటై మహాత్ముడి అడుగుజాడల్లో దేశం నడిచింది. ఒక్క సంఘ్ పరివార్ తప్ప! నేడు వారే దేశభక్తి, జాతీయత గురించి మాట్లాడటం రోత పుట్టిస్తుంది. ఆర్‌యస్‌యస్ యాభై రెండు సంవత్సరాలపాటు జాతీయ జెండాగా త్రివర్ణ పతాకాన్ని ఒప్పుకోలేదు! కనీసం గౌరవించలేదు! 1910లో అతివాద సావర్కర్ లండన్‌లో చదువుకుంటూ, ఇండియా హౌస్ కేంద్రంగా హిందూ-జర్మన్ కుట్రలో అక్కడి అతివాదులు, మారణాయుధాల సరఫరాదారుతో సంబంధాలు కలిగి ఉన్నాడని లండన్‌లో సావర్కర్‌ను అరెస్ట్‌చేసి, నౌకలో భారత్‌కు తరలించే సమయంలో పోర్టులో నిలిపిఉంచిన నౌక మరుగుదొడ్డి కిటికీనుండి పారిపోవడానికి ప్రయత్నిస్తే పట్టుకుని భారత్‌కు తరలించారు. 50సంవత్సరాల జైలుశిక్ష విధించి, అండమాన్ జైలుకు పంపించారు. సావర్కర్ బ్రిటీష్ ప్రభుత్వానికి పదులసంఖ్యలో క్షమాభిక్ష పెట్టమని ఉత్తరాలురాస్తే అండమాన్ జైలునుండి 1924లో బ్రిటీష్ ప్రభుత్వం విడిచిపెట్టింది. అందుకు ప్రతిఫలంగా నాటి నుండి భారతీయుల సుదీర్ఘ స్వాతంత్ర్య పోరాటానికి వ్యతిరేకంగా బ్రిటీష్ అధికారులతో చేతులుకలిపి, ఆనాడే ఈ దేశం రక్తం చిందించటానికి కారకులయ్యారు! అంతేకాదు మహాత్మగాంధీ హత్యకు హంతకులను తయారుచేసింది ఈ మనువాదులే!

మహాత్మ గాంధీ హత్యకేసులో కోర్టుబోనులో నిందితుడుగా నిలబడి విచారణ ఎదుర్కొన్న సావర్కర్, సంఘ్ పరివార్‌కు ఆరాధ్యుడయ్యాడు. ఇతని పేరు ముందు వీర్ అనే పదంచేర్చి వీర్ సావర్కర్‌గా ప్రచారం కల్పిస్తున్నారు. సవార్కర్ పిరికివాడు, నాడు బ్రిటీషర్ల క్షమాభిక్ష పొందాడు. మహాత్మగాంధీ హత్యకేసు విచారణకోర్టు హాలులో నిందితుల్లో ఒకరైన సావర్కర్, కోర్టువారితో నాథూరామ్ గాడ్సే, గోపాల్ గాడ్సే, నారాయణ్ ఆప్టే, విష్ణు కర్కరే, మదన్లాల్ పహ్, దిగంబర్ బాడ్గే, శంకర్ కిష్టయ్య ఎవరో నాకుతెలియదు అని మరోసారి తన పిరికితనాన్ని కోర్టుహాల్లో ప్రదర్శించాడు సవార్కర్. నిందితుల్లో దిగంబర్ బాడ్గే అప్రూవర్‌గా మారి మహాత్మగాంధీ దారుణ హత్యకేసు విచారణలో సహాయపడ్డాడు. గాంధీహత్యకు ముందు నాథూరామ్ గాడ్సే, నారాయణ్ ఆప్టే, దిగంబర్ బాడ్గే సావర్కర్ ఇంటికి వెళతారు. గుమ్మం బయట దిగంబర్ బాడ్గేను ఉండమని, గాడ్సే, నారాయణ్ ఆప్టే ఇంటి లోపలికి వెళ్లి సావర్కర్‌తో సమావేశం ముగించుకుని బయటికి వస్తారు. గాంధీ హత్యకు సావర్కర్ ఆశీస్సులు మనకు లభించాయి. విజయంతో తిరిగి రండి అన్నారని దిగంబర్ బాడ్గేకు తెలియజేస్తారు. ఇదే విషయాన్ని బాడ్గే కోర్టు విచారణలో జడ్జికి తెలియజేస్తాడు. సావర్కర్ న్యాయవాది దిగంబర్ బాడ్గే సాక్ష్యం చెల్లదని వాదిస్తాడు. సవార్కర్, దిగంబర్ బాడ్గేతో నేరుగా సంభాషించలేదు. (ప్రత్యక్ష, వ్యక్తిగత ఆధారంగా కాకుండా మరొక వ్యక్తినుండి విన్నదాని ఆధారంగా సాక్ష్యం) చెల్లదు అనివాదించి సాంకేతికంగా సావర్కర్ ఉరిశిక్ష నుండి తప్పించుకున్నాడు. నాథూరామ్ గాడ్సే, నారాయణ్ ఆప్టే నోరు విప్పకుండా తమ గురువును కాపాడారు. మతం వేరు.. మతోన్మాదం వేరు. అది ఇస్లాం అయినా.. హిందూత్వం, క్రిస్టియన్ అయినా..ఇది అందరం



గుర్తుపెట్టుకోవాల్సిన విషయం. మతోన్మాదమే అప్పుడు, ఇప్పుడు దేశాన్ని పట్టి పీడిస్తోంది.. గాంధీజీ జీవితం భారతావనికి ఒక అపురూప చరిత్ర. ప్రపంచంపై చెరగని ముద్రవేసిన మహనీయుడు గాంధీజీ. మతోన్మాదంతో మహాత్ముడినే పొట్టన పెట్టుకున్న నీచులకు భారతీయత గురించి ఏం తెలుస్తుంది. మతోన్మాదం దేశంలో ఇప్పుడు జడలు విప్పి నాట్యంచేస్తుంది. ఒకవైపు గాంధీని స్మరిస్తూ.. మరోవైపు గాడ్సేని కీర్తిస్తూ.. సావర్కర్ను హీరోగా ఆరాధిస్తూ.. దేశాన్ని భ్రష్టుపట్టిస్తున్నారు. స్వాతంత్ర పోరాటంలో తొలి తరం మహనీయులు తమ సర్వస్వం ఈ దేశం కోసం ధారపోసారు. ప్రజలందరూ ఐక్యం కాకుండా ఉండేందుకు మతతత్వ, మనువాద రాజకీయాల మంటలు రాజేస్తున్నాయి. సావర్కర్ను జాతీయోద్యమ నేతగా చిత్రించడం దారుణం. చరిత్రను చెరిపేయాలనీ.. అదీ సాధ్యం కాకపోతే వక్రీకరించాలనీ మోదీ ప్రభుత్వం యత్నిస్తోంది. భారతదేశంలో మతోన్మాదంతో హిందూ-ముస్లిం మతహింసలో ముస్లింలు, హిందువులు వేలల్లో హతులయ్యారు. ఉత్తరభారతదేశంలో ముస్లింలపై కుట్రపూరిత దాడులు పెరిగాయి. ఫలితంగా బీజేపీ ఎన్నికలలో మరింత విజయాన్ని సాధించింది. ఇప్పుడు వర్తమాన మోదీ న్యూ ఇండియాలో ఆంధ్రప్రదేశ్, అమలాపురం ప్రాంతానికి చెందిన రామ్‌మాధవ్ 2014-2020 వరకు భారతీయ జనతాపార్టీ జాతీయ ప్రధానకార్యదర్శిగా ఉన్నారు. ఆ సమయంలో మణిపూర్‌లో మైతీ లిఫూన్, అరంబై టెంగోల్ సాంస్కృతిక ముసుగు సంస్థలు పనిచేస్తున్నాయి. ఈ రెండు సంస్థలు మైతీల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పేర్కొన్నాయి. వీటి నిర్మాణంలో రామ్‌మాధవ్ కీలకపాత్ర పోషించారనే ఆరోపణ ఎక్కువగా వుంది. వీరికి వెన్నుదన్నుగా వెనకనుంచి నడిపించేది ఆర్ఎస్ఎస్, బజరంగ్ దళ్, బీజేపీ అనేది అక్కడి ప్రతిపక్షాల ప్రధాన ఆరోపణ. ఇప్పుడు ఆ రెండు సంస్థలే మణిపూర్‌లో ఉద్భవించిన సరికొత్త తీవ్రవాద సమూహం. ఈ గుంపు ఆధ్వర్యంలో ఇప్పుడు అక్కడ జరుగుతున్న అమానవీయ ఆటవిక సంఘటనలు దేశాన్ని తీవ్రదిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. అంతేకాకుండా రామ్‌మాధవ్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వశర్మ 2017 అసెంబ్లీ, 2019 పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలుపుకోసం కుకి మిలిటెంట్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారని కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు రాసిన లేఖలో కుకీ తీవ్రవాద సంస్థ చైర్మన్ ఆరోపించారు. హిమంత బిస్వశర్మ, రామ్‌మాధవ్‌ను ప్రాసిక్యూట్ చేయాలనే ప్రతిపక్షాల డిమాండ్ అరణ్యరోదన అయ్యింది.

హిందుస్థాన్ చరిత్ర ఇలా రక్తసిక్తంగా సాగుతూనే ఉంటుందా అంటే! ద్వేషం ద్వేషంతో సమసిపోదు. దానికి సరైనమందు ప్రేమ మాత్రమే అని బుద్ధుడు ప్రపంచానికి చెప్పాడు. అడ్డుకట్టవేయాల్సింది ఈ దేశప్రజలే. శక్తివంతమైన మోదీలను తయారుచేసేది ప్రజలే! శక్తి హీనులను చేసే శక్తికూడా ఈ ప్రజలదే.

శుభాకర్ మేడసాని, జర్నలిస్ట్.

మణిపూర్ బాధితులకు పరిహారం పెంచాలి

- స్పష్టం చేసిన గీతా మిట్టల్ కమిటీ
- సుప్రీంకోర్టుకు మూడు నివేదికలు

న్యూదిల్లీ: జాతుల మధ్య వైరంతో ఈశాన్య రాష్ట్రం మణిపూర్ ఇప్పటికీ అట్టుడికుతోంది. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు దాకా వెళ్లిన విషయం తెలిసిందే. మణిపూర్‌లో బాధితుల పునరావాసాన్ని పర్యవేక్షించేందుకు సుప్రీం కోర్టు... మాజీ న్యాయమూర్తి గీతల్ మిట్టల్ నేతృత్వంలోని కమిటీ నియమించింది. ఈ కమిటీ సోమవారం సుప్రీంకోర్టుకు మూడు నివేదికలను సమర్పించింది. అందులో హింస వల్ల నలిగిపోతున్న మణిపూర్ ప్రజలకు పరిహారం ఇచ్చే పథకాన్ని పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని కోర్టుకు తెలిపింది. మణిపూర్ హింసాకాండలో నిరాశ్రయులైన బాధితులకు పరిహారాన్ని పెంచాల్సిన అవసరం ఉందని కమిటీ స్పష్టం చేసింది. అలాగే అత్యసర డాక్యుమెంట్లను కూడా తిరిగి జారీ చేయాల్సి ఉందని తెలిపింది. అయితే ముగ్గురు సభ్యుల కమిటీ పనితీరును సులభతరం చేసేందుకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ మూడు నివేదికల కాపీలను సంబంధిత న్యాయవాదులందరికీ అందించనున్నట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం తెలిపింది. కమిటీ కోసం సూచనలను క్రోడీకరించాల్సిందిగా బాధితుల్లో ఒకరి తరఫున హాజరైన న్యాయవాది వృందా గ్రోవర్‌ని ఆదేశించింది. 'మణిపూర్ హింసాత్మక ఘటనల్లో అనేకమంది బాధితులు అత్యవసర డాక్యుమెంట్లను పోగొట్టుకున్నారు. బాధితులకు అత్యవసరమైన డాక్యుమెంట్లను తిరిగి జారీ చేయాల్సిన అవసరం ఉంది... మణిపూర్ బాధితుల పరిహారాన్ని పెంచాల్సిన అవసరం ఉంది... నోడల్ అడ్మినిస్ట్రేషన్ నిపుణుడిని నియమించాలి అని జస్టిస్ గీతా మిట్టల్ కమిటీ నివేదికలో సూచించినట్లు" అని ధర్మాసనం తెలిపింది. 'సుప్రీంకోర్టు (మణిపూర్ హింసపై) ఏర్పాటు చేసిన కమిటీ..మూడు నివేదికలను సమర్పిం చింది. ఈ నివేదికలన్నీ పిటిషనర్లకుర్ల అందుబాటులో ఉంటాయి. వాటిని మేం పరిశీలిస్తాము.

కమిటీ ఎలా పని చేయాలో విధానపరమైన అంశాలను సూచిస్తాం' అని సుప్రీంకోర్టు న్యాయవాది విశాల్ తివారీ తెలిపారు.

మణిపూర్ బాధితుల పరిహారం, పునరావాసానికి సంబంధించి ముగ్గురు మాజీ మహిళా హైకోర్టు జడ్జీలతో ఓ కమిటీని నియమించనున్నట్లు ఈ నెల 7న సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి విదితమే. కమిటీ నివేదికలను నేరుగా సుప్రీంకోర్టుకు సమర్పిస్తుందని పేర్కొంది. అలాగే క్రిమినల్ కేసుల విచారణను పర్యవేక్షించాల్సిందిగా మహారాష్ట్ర పోలీస్ చీఫ్ దత్తాత్రరు పదసాల్గికర్‌ను నియమించింది.

కోల్‌కతాలో ఈడీ సోదాలు

కోల్‌కతా: స్కూల్ ఉద్యోగాల కుంభకోణంపై దర్యాప్తునకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సోమవారం కోల్‌కతా, నగర పరిసరాల్లోని వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. దర్యాప్తు అధికారులు శోధిస్తున్న ప్రదేశాలలో న్యూ అలీపూర్‌లోని కార్యాలయ భవనం, కుంభకోణంలో అరెస్టయిన సుజోయ్‌కృష్ణ భద్రకు సంబంధించిన భబానీపూర్ అపార్ట్‌మెంట్ కూడా ఉన్నాయని సంబంధిత అధికారులు తెలిపారు. న్యూ అలీపూర్‌లోని భవనంలో రాష్ట్రంలో ప్రభావశీల రాజకీయ కుటుంబానికి సంబంధించిన ప్రైవేట్ కంపెనీ కార్యాలయం ఉంది. రాజకీయ వర్గాల్లో 'కాళీఘాట్-ఎర్ కాకు' (కాళీఘాట్ మామ)గా పిలవబడే భద్ర ఈ కంపెనీ వ్యవహారాలను నిర్వహించేవాడని పరిశోధకులు పేర్కొన్నారు. 'ఈ కంపెనీ ద్వారా చేసిన అవాస్తవిక నిధుల బదిలీకి సంబంధించి మేము కొన్ని నిర్దిష్ట పత్రాల కోసం వెదుకుతున్నాం' అని ఈడీ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈ కుంభకోణంలో మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ జరుపుతోంది. ఇందులో కొంతమంది విద్యా శాఖ అధికారులు, సీనియర్ టీఎంసీ నాయకులను అరెస్టు చేశారు.

మైనర్‌పై అత్యాచారం... అధికారి అరెస్టు

న్యూదిల్లీ: మైనర్‌పై అనేకమార్లు అత్యాచారానికి పాల్పడి గర్భం దాల్చడానికి కారకుడైన దిల్లీ ప్రభుత్వ సీనియర్ అధికారి, అతడి భార్యను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడైన శిశు సంక్షేమాభి వృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను సస్పెండ్ చేస్తూ ఇప్పటికే దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆదేశించారు. బాధితురాలు... తన తండ్రి అక్టోబర్ 1, 2020న మరణించిన తర్వాత నిందితుడి కుటుంబతో కలిసి వారి ఇంట్లో ఉంటోంది. నవంబర్ 2020, జనవరి 2021 మధ్య నిందితుడు బాలికపై అనేకసార్లు అత్యాచారం చేశాడని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. గర్భస్రావం కోసం బాలికకు మందులు ఇచ్చినందుకు నిందితుడి భార్యపై కూడా అభియోగాలు మోపామని వెల్లడించారు. ఈ వ్యవహారంపై దిల్లీ ప్రభుత్వం స్పందిస్తూ... నిందితులపై ఆరోపణలు రుజువైన పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది.

కొత్త రాజ్యసభ సభ్యుల ప్రమాణం

న్యూదిల్లీ: విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సహా రాజ్యసభకు ఎన్నికైన తొమ్మిది మంది సోమవారం రాజ్యసభ కొత్త సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్ హౌస్‌లో చైర్మన్ జగదీప్ ధన్కర్ వీరిచేత ప్రమాణం చేయించారు. 'రాజ్యసభ సభ్యునిగా ఈరోజు నేను ప్రమాణ స్వీకారం చేస్తున్నందుకు చాలా గౌరవంగా భావిస్తున్నాను. దేశ ప్రజలకు సేవ చేయడాన్ని కొనసాగించే అవకాశం కల్పించిన గుజరాత్ ప్రజలకు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీ, ప్రజలకు ధన్యవాదాలు' అని రాజ్యసభ ఎంపీగా రెండోసారి ఎన్నికైన జైశంకర్ ట్వీట్ చేశారు. జైశంకర్ 2019లో తొలిసారిగా రాజ్యసభకు ఎన్నికయ్యారు. జైశంకర్‌తో పాటు ప్రమాణ స్వీకారం చేసిన ఇతర బీజేపీ సభ్యుల్లో బాబూభాయ్ జెసంగ్‌భాయ్ దేశాయ్ (గుజరాత్), కేస్రీదేవ్‌సింగ్ దిగ్విజయ్‌సింగ్ ఝాలా (గుజరాత్), నాగేంద్ర రాయ్ (పశ్చిమ బెంగాల్) ఉన్నారు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు... డెరెక్ ఓబ్రెయిన్, డోలా సేన్, సుఖేందు శేఖర్ రే, ప్రకాష్ చిక్ బరైక్, సమీరుల్ ఇస్లాం కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఓబ్రెయన్, సేన్, రే బెంగాలీలో ప్రమాణం చేశారు.

ఎస్‌పీ నేతపై షూ విసిరిన అగంతకుడు

లక్నో: సమాజ్‌వాదీ పార్టీ నేత స్వామి ప్రసాద్ మౌర్యపై ఒక వ్యక్తి షూ విసరడం ఉద్రిక్తతకు దారితీసింది. లక్నోలోని ఇందిరాగాంధీ ప్రతిష్ఠాన్ వద్ద సోమవారం జరిగిన ఓబీసీ సమ్మేళన్‌లో మౌర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా లాయర్ దుస్తుల్లో ఉన్న ఓ యువకుడు మౌర్యపై షూ విసిరాడు. దీంతో వెంటనే మౌర్య మద్దతుదారులు మూకుమ్మడిగా అతనిపై దాడి చేశారు. 'స్వామి ప్రసాద్ మౌర్య జిందాబాద్' అని నినాదాలు చేస్తూనే ఆ వ్యక్తిపై దాడి చేయడంతో అతను అక్కడికక్కడే సొమ్మసిల్లి పడిపోయాడు. దాడిని నిలువరించేందుకు పోలీసులు ప్రయత్నించినప్పటికీ మౌర్య మద్దతుదారులు వెనక్కి తగ్గలేదు.

కావేరీ జలాల పంపకంపై రాజ్యాంగ ధర్మాసనానికి సుప్రీం ఓకే

న్యూదిల్లీ: కావేరీ జల పంపకాలకు సంబంధించిన వివాదంపై రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. న్యాయమూర్తులు డీవై చంద్రచూడ్, సూర్యకాంత్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ ఈ నిర్ణయం తీసుకుంది. కావేరీ జలాల వివాదం కర్నాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి మధ్య దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఇక్కడి లక్షలాది మంది ప్రజలకు సాగు, తాగునీటి అవసరాలను కావేరీ జలాలు తీరుస్తున్నాయి. దీంతో కావేరీ జలాల పంపకాలపై తరచు రాష్ట్రాల మధ్య విభేదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనిపై చివరిసారిగా 2018లో సుప్రీంకోర్టు విచారణ జరిపి, కావేరీ యాజమాన్య పథకాన్ని నోటిఫై చేయాల్సిందిగా కేంద్రాన్ని ఆదేశించింది. జలాల పంపకాలపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. అయితే, కావేరీ మేనేజ్‌మెంట్ స్కీమ్‌ను ఇంతవరకూ కేంద్రం నోటిఫై చేయలేదు. దీంతో తరచూ రాష్ట్రాల మధ్య ఉద్రిక్తతలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటుకు సుప్రీంకోర్టు ఆదేశించడం సానుకూల పరిణామంగా భావిస్తున్నారు. బెంచ్ ఏర్పాటు ద్వారా ఈ వివాదానికి అంతిమ పరిష్కారం కనుగొనే అవకాశం ఉంటుంది. రాబోయే కొద్ది వారాల్లో బెంచ్ ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి. 2023 సెప్టెంబర్ 15లోగా తమ వాదనలను కోర్టుకు సమర్పించాలని రాష్ట్రాలను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ క్రమంలో రాష్ట్రాల అవసరాలు, పర్యావరణం, శాంతి భద్రతలను పరిగణనలోకి తీసుకుని అందరికీ ఉపయుక్తమైన నిష్పాక్షిక నిర్ణయాన్ని అత్యున్నత న్యాయస్థానం తీసుకోవాల్సి ఉంటుంది.

రైతు నేతలపై ఉక్కుపాదం

16 యూనియన్ల నేతల ముందస్తు అరెస్ట్

చండీగడ్: రైతు సంఘాల నాయకులపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. వరద సాయం కోసం శాంతియుత నిరసనకు పిలుపునిచ్చిన రైతులను పంజాబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ (కేఎంఎస్‌సీ) నేతృత్వంలోని 16 యూనియన్‌ల రైతు నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి సోమవారం తెల్లవారుజామున వీరిని అక్రమంగా అదుపులోకి తీసుకున్నట్లు రైతుసంఘాలు విమర్శించాయి. కేఎంఎస్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు శర్వణ్ సింగ్ పంథేర్, బీకేయూ(క్రాంతికారి) ప్రెస్ సెక్రటరీ బల్దీప్ సింగ్, కేఎంఎస్‌సీ రాష్ట్ర ప్రెస్ సెక్రటరీ కన్వర్‌దిలీప్ సింగ్, బీకేయూ (బెహార్‌మేక్)కి చెందిన చంకౌర్ సింగ్, బర్త్ సింగ్‌లను అరెస్ట్ చేశారు. మరికొందరు నేతల కోసం గాలిస్తున్నట్లు సమాచారం. వరద కారణంగా నష్టపోయిన రైతులకు ప్రకటించిన పరిహారం వెంటనే చెల్లించాలంటూ రైతు సంఘాలు ఆగస్ట్ 22న చండీగఢ్‌లో నిరసనకు పిలుపునిచ్చాయి. ఈ నిరసనకు సంబంధించి చండీగఢ్, పంజాబ్ పోలీసులకు, రైతు సంఘాలకు మధ్య ఆదివారం సుదీర్ఘ చర్చలు జరిపినట్లు రైతు నేత శర్వణ్‌సింగ్ పంథేర్ తెలిపారు. అయితే చర్చలు విఫలమయ్యాయని అన్నారు. అనంతరం ఆదివారం రాత్రి పంజాబ్ గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్‌ను కూడా కలిశామని చెప్పారు. నిరసనను అడ్డుకునేందుకు పోలీసులు అనేకమంది నేతలను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారని అన్నారు. ఈ అక్రమ అరెస్ట్‌లను ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌కేఎం సహా అనేక రైతు సంఘాలు అరెస్ట్‌లను ఖండించాయి.

సన్నీ విల్లా వేలం నోటీసు వెనక్కి

దీని వెనుక ఎవరున్నారు: కాంగ్రెస్

ముంబై: బాలీవుడ్ నటుడు, బీజేపీ ఎంపీ సన్నీ డియోల్ విల్లా వేలానికి ఇచ్చిన నోటీసును బ్యాంక్ ఆఫ్ బరోడా వెనక్కి తీసుకుంది. ఈ మేరకు సోమవారం ప్రకటన చేసింది. సాంకేతిక సమస్యలను కారణంగా చూపి, నోటీసును ఉపసంహరించుకుంది. దీనిపై కాంగ్రెస్ అనుమానం వ్యక్తం చేస్తూ... విమర్శలు గుప్పించింది. రుణం తిరిగి చెల్లించని కారణంగా సన్నీకి చెందిన ఓ విల్లాను వేలం వేయనున్నట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. తన తండ్రి ధర్మేంద్ర, సోదరుడు బాబీతోపాటు జుహూలో ఉన్న సన్నీ విల్లాను హామీగా చూపించి ఆయన ఈ రుణం పొందారని... దాదాపు రూ.56 కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపింది. లోన్ రికవరీలో భాగంగా సన్నీ విల్లాను వేలం వేయనున్నట్లు మీడియాలో వెల్లడైంది. సెప్టెంబర్ 25న ఈ వేలం జరగనుందని ఆ కథనాలు పేర్కొన్నాయి. ఇది బాలీవుడ్‌లో చర్చకు దారితీసింది. తాజాగా నోటీసును ఉపసంహరించుకుంటున్నట్లు బ్యాంకు ప్రకటించింది. దీనిపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ సామాజిక మాధ్యమాల్లో స్పందించారు. 'బ్యాంక్ ఆఫ్ బరోడాకు రూ.56 కోట్లు చెల్లించాల్సి ఉన్నందున సన్నీ డియోల్‌కు చెందిన జుహూలో ఉన్న విల్లాను ఇ-వేలం వేయనున్నట్లు వచ్చిన వార్తలను అందరం చూశాం. 24 గంటల్లోనే సాంకేతిక సమస్య కారణం చూపుతూ బ్యాంక్ ఆ నోటీసును ఉపసంహరించుకుంది. ఈ సాంకేతిక కారణాల వెనక ఎవరున్నారనేది ఆశ్చర్యంగా ఉంది' అని విమర్శించారు. ఇదిలా ఉంటే...సన్నీ డియోల్ 'గదర్ 2' విజయానందంలో ఉన్నారు. 2001లో విడుదలైన 'గదర్'కు సీక్వెల్‌గా 'గదర్ 2' రూపొందింది. ఇందులో సన్నీ డియోల్ తారాసింగ్ పాత్రలో నటించారు.

కాంగ్రెస్ పాలన కుంభకోణాల యుగం

ఇప్పుడు ప్రతి పైసా పేదల ఖాతాల్లోకే: మోదీ

న్యూదిల్లీ: కాంగ్రెస్ పాలనలో పేద ప్రజల హక్కులు, సంపద దోపిడీకి గురయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. 2014కు ముందు దేశంలో చోటుచేసుకున్న అవినీతి, కుంభకోణాలను ప్రజలు మర్చిపోరని అన్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం అధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న ప్రధాని... కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 2014కు ముందు కాంగ్రెస్ పాలనలో దేశంలో జరిగిన అవినీతి, కుంభకోణాలను ప్రజలు ఎప్పటికీ మర్చిపోబోరని, పేద ప్రజల హక్కులు, సంపద దోపిడీకి గురయ్యాయని, కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ సాయం వారి చేతికి అందకముందే దోపిడీకి గురయ్యేదని ఆరోపించారు. కానీ, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అందించే నగదు సాయం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి చేరుతుందన్నారు. ప్రజలు పేదరికం నుంచి బయటపడుతున్నారని, వ్యవస్థలో దోపిడీని అడ్డుకుంటే పేదల సంక్షేమానికి ఎక్కువ మొత్తం ఖర్చు చేయవచ్చని, దానివల్ల ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందని ప్రధాని చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థ 2014లో 10వ స్థానంలో ఉంటే ప్రస్తుతం ఐదో స్థానానికి చేరిందని మోదీ పేర్కొన్నారు. పన్ను రూపంలో చెల్లించే ప్రతి పైసా దేశాభివృద్ధికి ఖర్చవుతున్నట్లు ప్రజల్లో నమ్మకం ఏర్పడిందని, అందుకే 2014 తర్వాత పన్ను చెల్లింపుదారుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఆదాయపన్ను శాఖ గణాంకాల ప్రకారం పన్ను చెల్లించే వ్యక్తి సగటు ఆదాయం 2014లో రూ.నాలుగు లక్షలుగా ఉంటే...తొమ్మిదేళ్లలో రూ.13 లక్షలకు పెరిగిందని చెప్పుకొచ్చారు. గత ఐదేళ్లలో సుమారు 13.50 కోట్ల మంది భారతీయులు బీపీఎల్ (దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు) నుంచి బయటపడ్డారని నీతి ఆయోగ్ నివేదిక చెబుతోందని మోదీ గుర్తుచేశారు.

షేక్ అబ్దుల్లాను బీజేపీ అవమానించింది: ముఫ్తీ

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌ను భారతదేశంలో విలీనం చేయడానికి కృషి చేసిన నేషనల్ కాన్ఫరెన్స్ వ్యవస్థాపకుడు షేక్ మహమ్మద్ అబ్దుల్లాను బీజేపీ ప్రభుత్వం అవమానించిందని పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ పేర్కొన్నారు. 'కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్' నుంచి ప్రశస్తి చెందిన షేక్ అబ్దుల్లా పేరు 'షేర్'ని తొలగించడాన్ని ప్రస్తావిస్తూ ముఫ్తీ ఈ వ్యాఖ్య చేశారు. జేకేఎల్ఎఫ్ చీఫ్ మహ్మద్ యాసిన్ మాలిక్ భార్యను పాకిస్తాన్ తాత్కాలిక ప్రధాని అన్వారుల్ హక్ కకర్‌కు ప్రత్యేక సలహాదారుగా నియమించడంపై అడిగిన ప్రశ్నకు మెహబూబా సమాధానమిస్తూ... మిషాల్ మాలిక్ ఉగ్రవాది కాదని అన్నారు. 'నేను మిషాల్ మాలిక్ తరఫున వకాల్తా పుచ్చుకోవడం లేదు కానీ ఆమె ఉగ్రవాద దోషి కాదు. ఆమె భర్త యాసిన్ మాలిక్. ఆమె సాధ్వి ప్రజ్ఞా లాంటిది కాదు' అని 2008 మాలేగావ్ పేలుళ్ల కేసులో విచారణ ఎదుర్కొంటున్న భోపాల్‌కు చెందిన బీజేపీ ఎంపీని ఉద్దేశించి ఆమె అన్నారు. 'ఇక్కడ తమ ఎజెండాను అందిస్తున్నారని భావించే వ్యక్తులకు పాకిస్తాన్ ప్రతిఫలం ఇస్తోంది. షేక్ మహమ్మద్ అబ్దుల్లా పట్ల ప్రభుత్వం ఏం చేస్తోంది? ఈ విషయాన్ని బీజేపీ అర్థం చేసుకోవాలి. జమ్మూకశ్మీర్‌ను భారత్‌లో విలీనానికి కృషి చేసిన షేక్ సాహిబ్‌ను వారు అగౌరవపరిచారు. బీజేపీకి సిగ్గుచేటు' అని ముఫ్తీ ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. లడఖ్‌లోని భారత భూభాగాన్ని చైనా స్వాధీనం చేసుకున్నట్లు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వాదనపై ముఫ్తీ మాట్లాడుతూ... ఇది రాహుల్‌గాంధీ చెప్పే మాట కాదు... ఆ ప్రాంతంలోని స్థానికుల వాదన అని చెప్పారు. 'చైనా భారత భూభాగంలోకి ప్రవేశించింది. లడఖ్ ప్రజల గడ్డి భూమిపై పరిమితులు విధించింది. ఈ భూమిలో వెయ్యి చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని చైనా ఆక్రమించింది. ఇది రాహుల్ గాంధీ చెబుతున్నది కాదు, లడఖ్ ప్రజల వాదన' అని ముఫ్తీ తెలిపారు. చైనాను వెనక్కి పంపడానికి ఇప్పటివరకు అనేక దఫాలుగా జరిగిన విఫలమయ్యాయని ఆమె పేర్కొన్నారు. చాలా మంది భారతీయ ముస్లింలు హిందూ మతం నుంచి మారినవారేనని డీపీఏపీ అధ్యక్షుడు గులాం నబీ ఆజాద్ చేసిన వ్యాఖ్యలపై ముఫ్తీ మండిపడ్డారు. "ఆయన సంఘ్ భాషలోనే మాట్లాడుతున్నాడు. చాలా మంది భారతీయ ముస్లింల పూర్వీకులు హిందువులని, ముస్లింలను 'ఘర్ వాపసీ' చేయాలని కూడా వారు అంటున్నారు. ఈ రోజు భారతీయ ముస్లింలు అభద్రతాభావంతో ఉన్నారు. ఒక ముస్లిం వ్యక్తి హిందూ అమ్మాయిని పెళ్లి చేసుకుంటే... ఆ వ్యక్తి తల్లిదండ్రులను కొట్టి చంపారు. ముస్లింలను రైళ్లలో చంపుతున్నారు, వారి ఇళ్లను ధ్వంసం చేస్తున్నారు" అని ముఫ్తీ అన్నారు. జమ్ముకశ్మీర్ ప్రజలకు జరిగిన అన్యాయాలకు వ్యతిరేకంగా పీడీపీ పోరాడుతుందని ఆమె తెలిపారు.

దేశ ప్రగతిలో మహిళల కృషి అనిర్వచనీయం

రాష్ట్రపతి ముర్ము ప్రశంస

న్యూదిల్లీ: జీవితంలో ఎదురయ్యే ఎన్నో సవాళ్లను అధిగమించి ముందుకు సాగుతున్న నారీమణులను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కొనియాడారు. దిల్లీలోని మానేక్షా సెంటర్‌లో సోమవారం నిర్వహించిన ఆర్మీవైవ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. 'నారీ శక్తి' గురించి రాష్ట్రపతి ప్రసంగించారు. ఒక సైనికుని సతీమణి, ఝార్ఖండ్ నుంచి వచ్చిన ఓ ఉపాధ్యాయురాలు తమ జీవితంలో ఎదుర్కొన్న సమస్యలను గురించి పంచుకున్నారు. అంతేకాకుండా ఆత్మస్థైర్యంతో వాటిని ఎదుర్కొన్న తీరును వివరించారు. అనంతరం ముర్ము మాట్లాడుతూ ముందుగా ఆర్మీవైవ్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు సహకరించిన మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. 'ఇద్దరు వీర నారీమణుల జీవిత కథలను విన్నాం. క్లిష్ట సమస్యలు ఎదురైనా వారు దృఢ సంకల్పంతో ముందుకు సాగారు. అందుకే మహిళలను నారీశక్తిగా పిలుస్తున్నాం. సంగీతం నుంచి క్షిపణుల తయారీ వరకు మహిళల పాత్ర ప్రత్యేకమైనది. సమాజంలోని అసమానతలను సైతం ధైర్యంగా ఎదుర్కొని విజయం సాధిస్తున్నారు. దేశ ప్రగతిలో వారి కృషి అనిర్వచనీయం. ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక మహిళ ఉంటుందనేది పాత సామెత. కానీ, నేడు పురుషుడి పక్కనే ఆమె ఉంటోంది' అని అన్నారు. ఆర్మీ చీఫ్ మనోజ్ పాండే సతీమణి అర్చన పాండే ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. అనంతరం మహిళల సాధికారత కోసం ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ముర్ము సందర్శించారు. ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్కర్ సతీమణి సుదేశ్ ధన్కర్‌తో పాటు కేంద్రమంత్రి మీనాక్షి లేఖి పాల్గొన్నారు.

లాభాల్లో మార్కెట్ సూచీలు

ముంబై: దేశీయ మార్కెట్ సూచీలు సోమవారం లాభాల్లో ముగిశాయి. గత రెండు ట్రేడింగ్ సెషన్లలో వరుస నష్టాలకు గురైన సూచీలు కొనుగోళ్ల మద్దతులో రాణించాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల ప్రభావం భారత మార్కెట్‌పై పడింది. దేశీయంగా ఐటీ సహా అన్ని రంగాల షేర్లు రాణించాయి. దీంతో సెన్సెక్స్ 65 వేల పాయింట్ల ఎగువన ముగియగా...నిఫ్టీ 19,400 స్థాయికి కొద్ది దూరంలో ముగిసింది. లిస్టింగ్ నేపథ్యంలో జియో ఫైనాన్షియల్‌తో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు నష్టపోయాయి. ఉదయం 64,852.70 పాయింట్ల వద్ద ప్రారంభమైన సూచీ... కొద్ది సేపట్లోలోనే లాభాల్లోకి వెళ్లింది. రోజంతా లాభాలోల్ల కొనసాగింది. ఇంట్రాడేలో 65,335.82 పాయింట్ల వద్ద గరిష్టాన్ని తాకిన సూచీ... 276.43 పాయింట్ల లాభంతో 65,216.09 వద్ద ముగిసింది. నిఫ్టీ 83.45 పాయింట్ల లాభంతో 19,393.60 వద్ద స్థిరపడింది. లాభపడిన షేర్లు: బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, పవర్‌గ్రిడ్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, హిందాల్కో ఇండస్ట్రీస్, భారతీ ఎయిర్‌టెల్, అపోలో హాస్పిటల్స్, ఎన్టీపీసీ, ఐటీసీ, ఇన్ఫోసిస్, కోల్‌ఇండియా, టీసీఎస్,యాక్సిస్ బ్యాంక్ , టాటా స్టీల్ షేర్లు లాభాల బాట పట్టాయి. నష్టపోయిన షేర్లు : రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎం అండ్ ఎం, బ్రిటానియా ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, బీపీసీఎల్, ఎస్‌బీఐ, సిప్లా, మారుతీ సుజుకీ, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, బజాజ్ ఆటో షేర్లు నష్టపోయాయి. బంగారం రూ.8 స్వల్పంగా పెరిగి, రూ.58,383 కు చేరుకుంది. వెండి కిలో ధర రూ.410కు పెరిగి 70,645 కు చేరుకుంది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.11గా ఉంది.

విదేశీ వాణిజ్యం 800 బిలియన్ డాలర్లు దాటేసింది

న్యూదిల్లీ: భారతదేశ ఎగుమతులు, వస్తువులు, సేవల దిగుమతులు 2023 మొదటి ఆరు నెలల్లో 800 బిలియన్ డాలర్ల మార్కును దాటేసిందని థింక్ ట్యాంక్ జీటీఆర్ఐ వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా డిమాండు మందగించినప్పటికీ, 2023 ప్రథమార్థంలో సేవల విభాగంలో ఆరోగ్యకరమైన పెరుగుదల కారణంగా ఈ మార్కును దాటడం విశేషం. ఈ ఏడాది జనవరి-జూన్ మధ్య కాలంలో వస్తువులు, సేవల ఎగుమతులు 1.5 శాతం పెరిగి 385.4 బిలియన్ డాలర్లకు చేరాయి. జనవరి-జూన్ 2022లో 379.5 బిలియన్లుగా ఉన్నాయి. అయితే, దిగుమతులు జనవరి-జూన్ 2022లో 441.7 బిలియన్ డాలర్ల నుంచి ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో 5.9 శాతం తగ్గి.. 415.5 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. జనవరి-జూన్ 2023లో భారతదేశ విదేశీ వాణిజ్యం (వస్తువలు, సేవల ఎగుమతులు, దిగుమతులు) 800.9 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గతేడాది (జనవరి-జూన్ 2022)లో ఇదే కాలంలో 2.5 శాతం క్షీణితకు గురయిందని నివేదిక పేర్కొంది. స్వతంత్రంగా వస్తువలు ఎగుమతులు 8.1 శాతం తగ్గి 218.7 బిలియన్ డాలర్లకు చేరుకోగా, దిగుమతులు 8.3 శాతం తగ్గి 325.7 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఆరు నెలల కాలంలో సేవల ఎగుమతులు 17.7 శాతం పెరిగి 166.7 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. బహీనమైన గ్లోబల్ డిమాండు, లేబర్ ఇంటెన్సివ్ సెక్టార్‌లలో పోటీతత్వాన్ని కోల్పోవడం వల్ల డేటా స్వల్ప క్షీణతను చూపుతోంది. భారత రూపాయి విలువ పెరిగినప్పటికీ సరుకుల ఎగుమతుల క్షీణించాయి. రూపాయి మారకం రేటు ఏప్రిల్ 2022లో 76.16 నుంచి ఏప్రిల్ 2023లో 82.18కి పెరిగిందని జీటీఆర్ఐ సహ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ అన్నారు.

ఆతిథ్య పరిశ్రమ వాటా రూ.83 లక్షల కోట్లు

న్యూదిల్లీ: స్థూల దేశీయ ఉత్పత్తికి భారతీయ ఆతిథ్య పరిశ్రమ (హెూటల్ ఇండస్ట్రీ) 2047 నాటికి సుమారు రూ.83 లక్షల కోట్లను సమకూరుస్తోందని హెూటల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (హెచ్ఏఐ) నివేదిక అంచనా వేసింది. దేశీయ పర్యాటక సందర్శనలు, అంతర్జాతీయ రాకపోకల్లో గణనీయ పెరుగుదలతో ఇది సాధ్యమవుతోందని విజన్ 2047: ఇండియన్ హెూటల్ ఇండస్ట్రీ పేరుతో జెనోరి నాలెడ్జ్‌తో కలిసి హెచ్ఏఐ రూపొందించిన నివేదికలో పేర్కొంది. 2022లో హెూటల్ పరిశ్రమ దేశ జీడీపీకి సుమారు రూ.5.57 లక్షల కోట్లకు, 2947కు లక్ష కోట్ల డాలర్లకు చెరొచ్చని హెచ్ఏఊఐ అంచనా వేసింది. హెూటల్ పరిశ్రమ ఈ లక్ష్యాన్ని సాధించాలంటే మెట్రోలతో పాటు ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలకూ వసతిని పెంచాలని ఆతిథ్య పరిశ్రమ సమాఖ్య సూచించింది. మొత్తం పరిశ్రమ వాటాలో ఆహారం, పానీయాలు, సెలున్, స్పాలు వంటి విభాగాల వాటా కూడా కలిపి ఉంటుందని నివేదిక పేర్కొంది. అయితే సేవల విపణి వృద్ధికి మాత్రం ఇందులో నుంచి మినహాయించింది. దేశీయ పర్యాటక సందర్శనలు భారీగా పెరుగుతాయని నివేదిక అంచనా వేసింది.

సీఎం జగన్‌కు స్వల్ప అస్వస్థత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఆయన మడమ నొప్పి మళ్లీ తిరగబడటంతో విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో సోమవారం జరిగిన ఏపీఎన్జీవోల సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించిన అనంతరం కాలి మడమ నొప్పి మొదలు అవ్వడంతో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. గతంలోనూ ఇదే సమస్యతో ఒంటిమిట్ట శ్రీరాముడి దేవాలయంలో జరగాల్సిన పట్టు వస్త్రాల సమర్పణను వాయిదా వేసుకున్న విషయం విదితమే. రెండేళ్ల క్రితం వ్యాయామం చేస్తుండగా ఆయన మొదటిసారిగా మడమ నొప్పికి గురయ్యారు.

ప్రభుత్వాధికారులకు సమన్లు జారీ...

మార్గదర్శకాలు రూపొందిస్తాం: సుప్రీం

న్యూఢిల్లీ:

ప్రభుత్వ అధికారులకు సమన్లు జారీ చేసేటప్పుడు అన్ని న్యాయస్థానాలు అనుసరించాల్సిన విస్తృత మార్గదర్శకాలను రూపొందిస్తా మని సర్వోన్నత న్యాయస్థానం తెలిపింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు సోమవారం పేర్కొంది. పెండింగ్ కేసుల్లో వెలువడే తాత్కాలిక ఆదేశాలతో పాటు తుది తీర్పుల ధిక్కరణ జరిగినప్పుడు అనుసరించే విధివిధానాలు వేర్వేరుగా ఉండాలని అభిప్రాయపడింది. పెండింగ్ కేసుల్లో అధికారుల అఫిడవిట్‌లతో ఉద్దేశం నెరవేరుతుందిగానీ ధిక్కరణ కేసుల్లో ప్రభుత్వ అధికారులు కోర్టు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపింది. విచారణ ముగిసిన, పెండింగ్‌లో ఉన్న వ్యవహారాల మధ్య వర్గీకరణ అవశ్యమని త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వ అధికారులకు సమన్లు జారీ చేయడం కోసం మార్గదర్శకాల రూపకల్పనపై తీర్పును రిజర్వులో ఉంచుతూ ఉత్తరప్రదేశ్‌లో ఆర్థిక శాఖలో ఇద్దరు కార్యదర్శుల అరెస్టుకు దారితీసిన అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులను పక్కకు పెడుతున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. ధిక్కరణ కేసులో అలహాబాద్ హైకోర్టు ఆదేశాల మేరకు ఇద్దరు అధికారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యవహారం విచారణప్పుడు కేంద్రప్రభుత్వం సమర్పించిన ముసాయిదా ఎస్‌ఓపీలను పరిశీలించిన త్రిసభ్య ధర్మాసనం అందులో కొన్ని అంశాలు ఆచరణ సాధ్యం కానివిగా గుర్తించింది. ముసాయిదా ఎస్‌ఓపీని పరిశీలించాం.. అది న్యాయసమీక్ష కోసం అధికారాలను ఎలా వాడాలో సూచించేలా ఉందని వ్యాఖ్యానించింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ప్రతిపాదిత ఎస్‌ఓపీలో కొన్నింటిని తాను కూడా సమర్థించబోనని చెప్పారు. ధిక్కరణ కేసుల్లో జారీ అయ్యే సమన్లను ప్రభుత్వ అధికారులు సవాల్ చేస్తేగనుక ఆ ఫిర్యాదుకు సంబంధించి తుది పరిణామం వరకు కిందిస్థాయి కోర్టు వేచివుండాలని, ఆ తర్వాతే చర్యలు తీసుకునేందుకు వీలు ఉంటుందని మెహతా తెలిపారు. వాదనలు విన్న సర్వోన్నత న్యాయస్థానం ఇందుకు సంబంధించి విస్తృత ఎస్‌ఓపీని రూపొందిస్తామని తెలిపింది.

వైసీపీది అరాచక పాలన

- జగన్ మళ్లీ సీఎం కాలేరు
- కమ్యూనిస్టులు అసెంబ్లీలో అడుగుపెట్టడం తథ్యం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- 'గోదావరి గర్జన'తో ఎరుపెక్కిన రాజమహేంద్రవరం

విశాలాంధ్ర బ్యూరో-రాజమహేంద్రవరం:

రాష్ట్రంలో వైసీపీ అరాచకపాలనను ప్రజలు గమనిస్తున్నారు... రాబోయే ఎన్నికల్లో ఎన్ని అరాచకాలు, కుట్రలు కుయుక్తులు పన్నినా జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కాలేరని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పేర్కొన్నారు. 'రాష్ట్రాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి' నినాదంతో ఈనెల 17న విశాఖపట్నం నుంచి బయలుదేరిన సీపీఐ బస్సు యాత్ర సోమవారం తూర్పు గోదావరి జిల్లా కేంద్రం రాజమండ్రికి చేరుకుంది. ఈ సందర్భంగా వేలాది మంది పార్టీ శ్రేణులతో రాజమహేంద్ర వరం ఎరుపెక్కింది. యాత్రకు నేతృత్వం వహిస్తున్న రామకృష్ణకు తూర్పుగోదావరి జిల్లా సీపీఐ కార్యదర్శి తాటిపాక మధు నాయకత్వంలో ఘన స్వాగతం పలికారు. భారీ ప్రదర్శనగా బయలుదేరి స్థానిక కోటిపల్లి బస్టాండ్ వద్ద 'గోదావరి గర్జన' సభ నిర్వహించారు. ఈ బహిరంగ సభకు తాటిపాక మధు అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ... గోదావరి జిల్లాల ప్రజలు చైతన్యవంతుల న్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 77 ఏళ్లలో అన్ని ప్రభుత్వాలు కలిపి రూ.55 లక్షల కోట్ల అప్పు చేస్తే... నరేంద్ర మోదీ మాత్రం 9 ఏళ్ల పాలనలో రూ.100 లక్షల కోట్లు అప్పు చేశారని, ఇద్దరు గుజరాతీ కార్పొరేట్లకు మోదీ మేలు చేయడమే ధ్యేయంగా పెట్టుకున్నారన్నారు. మోదీ అధికారం లోకి వచ్చిన తర్వాత దేశంలోని సహజ సంపదలను బడా కార్పొరేట్ వ్యక్తులకు అప్పనంగా అప్పచెప్పారని విమర్శించారు. మోదీ విధానాలతో దేశంలోని రైతులు, కార్మికులు, విద్యార్థులు,యువకుల్లో నైరాశ్యం నెలకొందన్నారు. దేశంలో, రాష్ట్రంలో ఎప్పుడూ లేనంతగా దళితులు, మైనార్టీలు, గిరిజనులపై దాడులు ఎక్కువయ్యాయని చెప్పారు. మోదీ కాలంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మణిపూర్‌లో చోటుచేసుకున్న ఘటనలే ఇందుకు నిదర్శనమన్నారు. ఇక రాష్ట్రంలో పోలీసుల నియంత పాలన సాగుతోందన్నారు. ఉదాహరణకు మొన్న కడియం లో దళితుడిని పోలీసులు చావబాది... మూత్రం తాగించే స్థితికి వచ్చారంటే ఈ రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కేంద్రం నిధులిస్తే... పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తానని జగన్ చెప్పడం తన అవివేకానికి నిదర్శనం అన్నారు. ఈ నాలుగేళ్లలో జగన్మోహన్ రెడ్డి రూ.9 లక్షల కోట్లు అప్పులు చేశారని తెలిపారు. సంక్షేమం పేరుతో ప్రజలను తన ఎన్నికల మాయాజాలంలోకి లాగేసుకున్నార న్నారు. వాస్తవంగా నిత్యావసర ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు ఇతర రాష్ట్రాల కన్నా మన రాష్ట్రంలోనే ఎక్కువగా ఉన్నాయన్నారు. ఒక చేతితో పెట్టి మరో చేత్తో లాక్కుంటు న్నారని ఇదే జగన్ పరిపాలనని రామకృష్ణ విమర్శించారు. దేశంలో, రాష్ట్రంలో దోపిడీ, అరాచక పాలనకు ప్రజలు చరమ గీతం పాడేలా చైతన్య పరిచేందుకు 'రాష్ట్రాన్ని రక్షించండి, దేశాన్ని కాపాడండి' అనే నినాదంతో ప్రజల్లోకి వచ్చామన్నారు. కమ్యూనిస్టులకు భవిష్యత్తు ఉందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అసెంబ్లీలోకి కమ్యూనిస్టులు అడుగు పెడతారని రామకృష్ణ చెప్పారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ... మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే దేశానికి భద్రత ఉంటుందని, ఏడాదికి రెండు కోట్లమంది యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, నల్లధనాన్ని వెలికితీసి ప్రతి కుటుంబానికి రూ.15 లక్షల నల్లధనాన్ని పంచి పెడతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన మోదీ... ఆ హామీలను గాలికి వదిలి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆమె విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ... మోదీ ప్రభుత్వ విధానాలతో కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారన్నారు. ఉపాధి లేక యువత ఆందోళన చెందుతు న్నారని, వేతనాలు తగ్గి కార్మికుల ఇబ్బందులు పడుతు న్నారని చెప్పారు. దేశంలో రైతులు, కార్మికుల ఆత్మహత్యలు, మహిళలపై దాడులు పెరిగాయన్నారు. పార్లమెంటులో అవిశ్వాసం ప్రవేశపెట్టే వరకు మణిపూర్ అల్లర్లపై ప్రధాని మాట్లాడలేదంటే ఈ దేశానికి ప్రధానిగా ఆయన అనర్హుడు అని వారు విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో అటు మోదీకి ఇటు జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఇంకా ఈ బహిరంగ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దేగ ప్రభాకర్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, ఏఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు రాజేంద్ర బాబు, లెనిన్ బాబు, ప్రజానాట్యమండలి అధ్యక్ష ప్రధానకార్యదర్శులు చంద్రనాయక్, పెంచలయ్య, మహిళా సమైక్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ విమల, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షుడు కొండ్రపు రాంబాబు, రేఖ భాస్కరరావు, నగర కార్యదర్శి వీ కొండలరావు, జట్లు సంఘం ప్రధాన కార్యదర్శి చప్ప రమణ, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, చింతలపూడి సునీల్, కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర నేటి షెడ్యూల్

అమలాపురంలో రౌండ్ టేబుల్

ఎస్సీ, ఎస్టీలపై దాడులు... చర్చ

రాజోలు, నరసాపురంలో రోడ్ షో

తణుకులో బహిరంగ సభ

ప్రమాదంలో భావస్వేచ్ఛ

అరసం జాతీయ మహాసభల్లో ప్రొ.నామ్ శరన్ కౌర్

మాట్లాడుతున్న నామ్ శరన్ కౌర్

మహాసభలో పాల్గొన్న ఉర్దూ రచయిత్రి అవదేశ్ రాణి

(జబల్పూరు నుంచి వేల్పుల నారాయణ)

మునుపెన్నడు లేనివిధంగా భావస్వేచ్ఛ అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నదని వక్తలు అన్నారు. జబల్పూరులో జరుగుతున్న అభ్యుదయ రచయితల సంఘం జాతీయ మహాసభల్లో సోమవారం రెండవ రోజు వివిధ అంశాలపై సదస్సులు నిర్వహించారు. ముఖ్యంగా భావస్వేచ్ఛ ప్రమాదాలు, సవాళ్లు, సాంస్కృతిక భావ వ్యక్తీకరణ, ఉత్తమ సమాజ నిర్మాణంలో సాహిత్యం పాత్ర అనే అంశాలపై జరిగిన సదస్సుల్లో అనేకమంది వక్తలు మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అణచివేత నియంతృత్వ విధానాలను ఎండగట్టారు. రచయితలు తమ సాహిత్యాన్ని ఈ విధానాలపై ఎక్కుపెట్టి ప్రజాచైతన్యం కోసం కృషి చేయాలని కోరారు. భావస్వేచ్ఛపై జరిగిన సదస్సులో ప్రముఖ సాహితీవేత్త ప్రొఫెసర్ నామ్ శరన్ కౌర్ మాట్లాడుతూ ఇప్పుడు మనపై దాడి ప్రత్యక్షంగానే జరుగుతోందని, శత్రువు ఎవరో మనకు తెలిసిపోతున్నదని, అలాంటి శత్రువుపై మౌనం వహించరాదని చెప్పారు. మనం ప్రగతివాదులుగా దేశం బాగుపడాలని కోరుకుంటున్న దేశ ప్రేమికులమని, కానీ మనపై దేశద్రోహులుగా, ప్రమాదకారులుగా ముద్రలేస్తున్నారని విమర్శించారు. అక్రమకేసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని నామ్ శరన్ కౌర్ చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో మనం భయపడితే భవిష్యత్తు లేదన్నారు. డా.నరేశ్ కుమార్, డా.శాంతి, ఎల్.హనుమంతయ్య, వీరేంద్ర సాదవ్ తదితరులు మాట్లాడారు. సదస్సుకు పెనుగొండ లక్ష్మీనారాయణ, స్వర్ణసింగ్, విక్రం అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. దోపిడీకి వ్యతిరేకంగా సాంస్కృతిక భావ వ్యక్తీకరణ అనే అంశంపై జరిగిన సదస్సులో రాణేంగ్ర, అర్జుమంద్ ఆరా, డా.రహీంద్రనాథ్ రాయ్, రాకేశ్ ఇప్టా, షాహిన్వా రిజ్వా, అమితాబ్ చక్రవర్తి తదితరులు మాట్లాడుతూ దేశంలో హిందూత్వ శక్తులు సంస్కృతిని హైజాక్ చేస్తున్నాయని, దేశమంతా లైబ్రరీల్లో విశ్వహిందూ పరిషత్ భావజాలం చొరబడిందని, వీటిని తిప్పికొట్టాల్సిన అవసరం రచయితలపై ఉందన్నారు. 'ఉత్తమ సమాజ నిర్మాణంలో సాహిత్యం పాత్ర' అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆంధ్రప్రదేశ్ నుండి డా.నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ సాహిత్యం ఒక ఆయుధమని, దాన్ని ఉత్తమ సమాజ నిర్మాణానికి ఉపయోగించాలని విన్నవించారు. రాం పున్యాని, సరాబ్జిత్ సింగ్, డా.ఆరామే, ప్రొ.వేదప్రకాశ్ తదితరులు మాట్లాడారు. ప్రముఖ అభ్యుదయ రచయిత డా.ఏటుకూరి ప్రసాద్ రచించిన 'జనం నుంచి జనంలోకి', రాపోలు సుదర్శన్ రచించిన సంప్రోక్షణ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అరసం రచించిన 'మణిపూర్ మంటలు', బీవీ ఆచార్యులు రాసిన 'అక్షరం' పుస్తకాలను ఆవిష్కరించారు.



అరసం ఏలూరు జిల్లా ప్రచురించిన మణిపూర్ మంటలు (తెలుగు, హిందీ) ద్విభాషా కవితా సంకలనం ఆవిష్కరిస్తున్న తెలుగు రాష్ట్రాల ప్రతినిధులు

ప్రత్యేక హోదాపై నోరు విప్పండి

- ఏపీకి విభజన హామీలు అమలు చేసి తీరాల్సిందే
- గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉధృత పోరాటాలు చేశాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-కాకినాడ:

రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశంపై నోరు విప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. ప్రధాన పార్టీలయిన వైసీపీ, తెలుగుదేశం, జనసేన క్షేత్రస్థాయిలో పోరాటం సాగిస్తేనే ప్రత్యేక హోదా సాధ్యమని అన్నారు. 'రాష్ట్రాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి' నినాదంతో సీపీఐ చేపట్టిన బస్సు యాత్ర సోమవారం కాకినాడ చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక గాంధీ భవన్‌లో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, పార్టీ కాకినాడ జిల్లా ఇన్‌ఛార్జ్ దేగా ప్రభాకర్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పుడున్న ప్రధాన పార్టీలు ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుపై నోరు విప్పడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లో పని చేస్తున్నాయని, అధికారం వచ్చేవరకు ఒకలాగా, అధికారం వచ్చిన తరువాత మరోలా మాట్లాడుతు న్నారని అన్నారు. అప్పటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తనకు పార్లమెంటులో ఉన్న ఐదారుగురు ఎంపీలతో రాజీనామా చేయించి ఢిల్లీలో ప్రత్యేక హోదాపై ధర్నా చేశారని, అదేవిధంగా తెలుగుదేశం పార్టీ ఎన్‌డీఏ సర్కార్ నుంచి బయటకు వచ్చి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు ఢిల్లీలో ప్రత్యేక హోదా కోసం ధర్నా చేశారని గుర్తు చేశారు. మరోవైపు, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ప్రత్యేక హోదా అంశంపై కాకినాడ సభలో మాట్లాడుతూ పాచిపోయిన లడ్డూలు తమకు వద్దన్నారని చెప్పారు. అయితే ఇప్పుడు ఈ ప్రధాన పార్టీలు మోదీకి భయపడి నోరు విప్పకపోవడం దారుణమని రామకృష్ణ అన్నారు. మొన్నటి వరకు కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం ఆకాశం వైపే చూసేదని, కర్నాటక ఎన్నికల ఫలితాలు తర్వాత నేల చూపులు చూస్తోందని ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం మెడలు వంచేందుకు సరైన సమయం ఆసన్నమైం దన్నారు. ప్రత్యేక హోదాపై పోరాటం చేస్తే కచ్చితంగా సాధిస్తామని తెలిపారు. రాష్ట్రం ప్రభుత్వం పని తీరు అధ్వానంగా ఉందని, పరిశ్రమలన్నీ ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయన్నారు. ఐటీ రంగానికి సంబంధించి పార్లమెంటులో స్వయంగా కేంద్ర మంత్రి ఇచ్చిన సమాచారం ప్రకారం, రూ.11 లక్షల 59 వేల కోట్ల ఆదాయం దేశంలో ఐటీ రంగం ద్వారా ఉండగా, ఆంధ్ర ప్రదేశ్‌కు వచ్చేసరికి 0.14 శాతం మాత్రమే ఉందని ప్రకటించడం రాష్ట్రంలో ఎంత అధ్వాన స్థితిలో ఉందో తెలియజేస్తోందన్నారు. రెండు దశాబ్దాలయిన కోస్టల్ కారిడార్ విషయంలో ఒక్క పని కూడా ముందుకు సాగడం లేదని విమర్శిం చారు. మంచి అవకాశాలు ఉన్నాయని, పర్యావరణం దెబ్బ తినకుండా, సముద్ర జలాలు కలుషితం జరగకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి కోస్టల్ కారిడార్‌ను ముందుకు తీసుకుపోయేందుకు ప్రయ త్నించాలని కోరారు. సీపీఐ బస్సు యాత్ర ద్వారా ప్రజల్లో ఈ అంశాలపై అవగాహన కల్పిస్తూ ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకువెళతామని రామకృష్ణ వివరించారు.

ఏపీకి ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం కాదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పదే పదే ముగిసిన అంశంగా మాట్లాడుతుందని, అలాంటప్పుడు ఇతర రాష్ట్రాల్లో ప్రత్యేక హోదాను ఎలా కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా హక్కును సాధించే వరకు పోరాటాలు నిర్వహిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. విభజన హామీలను అమలు చేయడం భావితరాలకు ఎంతో అవసరమ న్నారు. అయితే రాష్ట్రంలో ఉన్న నీచ రాజకీయాలతో ప్రత్యేక హోదా అంశం పక్కదోవ పట్టిందని తెలిపారు. ప్రత్యేక హోదా అంశం నివురు గప్పిన నిప్పులాంటిదని, హోదాపై రాజకీయాలు చేస్తే నిప్పుల కుంపటిలో కాలిపోతారని అన్నారు. తెలుగు దేశం పార్టీ నాయకులు, రాజమండ్రి శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర విభజన సక్రమంగా జరగలేదని, పార్లమెంటు తలుపులు మూసి చట్టం చేశారని ఆరోపించారు. ఆ కారణంగానే కాంగ్రెస్ పార్టీ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ దెబ్బతిందని అన్నారు. అదే సమయంలో కేంద్ర మంత్రిగా ఉన్న వెంకయ్య నాయుడు రాజ్యసభలో ప్రత్యేక హోదాపై మాట్లాడుతూ పది సంవత్సరాలు కావాలని చెప్పారని, అయితే ఎన్నాళ్లయినా ఒక్క హామీ కూడా అమలు కాలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు గాంధీ రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విభజన హామీల అమలుకు కట్టుబడి ఉందని తెలిపారు. 2024లో కేంద్రంలో అధికారంలోకి వస్తే ఆంధ్ర రాష్ట్ర విభజన హామీలపై, ప్రత్యేక హోదాపై మొదటి సంతకం చేసేందుకు రాహుల్ గాంధీ సిద్ధంగా ఉన్నారని అన్నారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్లమెంటులో ప్రత్యేక హోదాపై చట్టం చేసి, ఇప్పుడు మోదీ ప్రభుత్వం ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని మాట్లాడు తుందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు మోదీ సర్కార్‌ను అధికారంలో నుంచి దించేందుకు సకల ప్రయత్నాలు చేయవలసిన అవసరం ఉందని అన్నారు. జాతీయ స్థాయిలో ఏర్పాటయిన ప్రతిపక్ష పార్టీల 'ఇండియా కూటమి' కచ్చితంగా బీజేపీని గద్దె దించుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రగతికి గొడ్డలి పెట్టుగా మారిన, ప్రజాస్వామ్య హక్కులను కాల రాస్తున్న మోదీకి దత్తపుత్రుడు అయిన జగన్‌మోహన్ రెడ్డిని కచ్చితంగా గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ కోస్టల్ కారిడార్ భూములు సేకరించేటప్పుడు పరిశ్రమలు ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. అరకొర పరిశ్రమలు తీసుకువచ్చినా అవి ప్రజల అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న పరిశ్రమలుగా ఉంటున్నాయని తెలిపారు. ప్రజా జీవితానికి ఇబ్బంది కలగకుండా కోస్టల్ కారిడార్‌ను అభివృద్ధి పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రావులపల్లి రవీంద్ర నాథ్, జిల్లా కార్యదర్శి తోకల ప్రసాద్, సీపీఎం నాయకుడు దువ్వ శేషుబాబు, కాకినాడ మాజీ శాసన సభ్యుడు వనమాడి వెంకటేశ్వరరావు కొండబాబు, సామాజిక వేత్త దోసర్లపూడి రమణ రాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, ఐఎన్‌టీసీ రాజు, సీపీఐ నాయకులు కొమ్మతి శ్రీనివాస్, ఏఐవైఎఫ్ కాకినాడ జిల్లా కార్యదర్శి పి.ఎస్.నారాయణ, ఆమ్ ఆద్మీ పార్టీ తదితర పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో తొలుత ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి కళాకారులు ఆలపించిన విప్లవ గేయాలు అలరించాయి. అనంతరం బస్సు యాత్ర కాకినాడ నుంచి తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రికి బయలుదేరి వెళ్లింది.

అశాస్త్రీయతతో సమాజానికి హానికరం

- మూఢనమ్మకాల వ్యతిరేక చట్టాన్ని తీసుకురావాలి
- డాక్టర్ దభోల్కర్ వర్ధంతి సభలో వక్తల పిలుపు

విశాలాంధ్ర-హైదరాబాద్:

అశాస్త్రీయతతో సమాజానికి హానికరమని, సమాజంలో మూఢ నమ్మకాలను తరిమికొట్టవలసిన అవసరం ఉందని వక్తలు తెలిపారు. డా.దభోల్కర్ 10వ వర్ధంతి సందర్భంగా జన విజ్ఞాన వేదిక ద్వారా సమాజంలోని మూఢనమ్మకాలు, శాస్త్రీయ దృక్పథంపై ఆగస్టు 19వ తేదీ ఉదయం హైదరాబాద్‌లోని పంజాగుట్ట ప్రెస్ క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశం డా. కోయ వెంకటేశ్వర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ పద్మజ షా, విశ్రాంత శాస్త్రవేత్త డా. సోమ మర్ల, ఉస్మానియా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.గంగాధర్ ప్రసంగించారు. సమాజంలో శాస్త్రీయత లేని సామాజికంగా హానికరమైన మూఢనమ్మకాలను ప్రచారం చేసే మతపరమైన టీవీ ఛానెళ్లను నిషేధించాలని సమావేశం డిమాండ్ చేసింది. సమాజంలోని అశాస్త్రీయతపై పోరాడేందుకు మూఢనమ్మకాల వ్యతిరేక చట్టాన్ని తీసుకురావాలని తెలంగాణ ముఖ్యమంత్రిని కోరారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.